J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 44 సంచిక : 40 7.03.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

ఆశ 'నిరాశ'ల బడ్జెట్

## భవిష్యత్‌పై బాకాలు.. వర్తమానంలో బాకీలు

### బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు

- హామీలు అమలు చేస్తామంటూనే.. అధ్వాన్న రాష్ట్రమంటూ బీద అరుపులు
- పెదవి విరుస్తున్న సామాన్య, మధ్యతరగతి వర్గాలు
- ఆత్మస్తుతి.. పరనిందకే ప్రాధాన్యమని విమర్శలు

విభజిత ఆంధ్రప్రదేశ్‌లో ఏకంగా మూడు లక్షల కోట్లు దాటిన రికార్డు బడ్జెట్.
కనీవిని ఎరుగని స్థాయిలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత.
విద్య, వైద్యం, వ్యవసాయ రంగ కేటాయింపుల్లో తిరుగులేని ఘనత.
పథకాలను అమలుచేస్తూనే, అభివృద్ధిని పరుగులు పెట్టించే ప్రణాళిక.
15 శాతం జీడీపీ వృద్ధి, తలసరి ఆదాయంలో గణనీయమైన పెంపు.

ఇదీ, బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ పయ్యావుల కేశవ్ ఆంధ్రప్రదేశ్‌పై భవిష్యత్‌పై చేసిన భీషణ ప్రతిజ్ఞలు. ఇవి నాణేనికి ఒకవైపు మాత్రమే, మరోవైపు..

2లో

## ఆడాళ్ళూ.. మీకు జోహార్లు!


అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం



- భారతీయ వ్యవస్థలో మహిళలకు ఎంతో ప్రాధాన్యం
- అనేక రూపాల్లో సేవలందిస్తున్న నారీమణులు
- మహిళల రక్షణకు శక్తి యాప్ తీసుకొస్తామన్న ఏపీ ప్రభుత్వం

ఆపదొస్తే అక్కున చేర్చుకునే అమ్మగా, దారితప్పితే దండించే అక్కగా, కష్టమొస్తే చేయూతనిచ్చే చెల్లిగా, కొడుకు ప్రేమను మరపించే కోడలిగా, అమ్మని మరపించే అత్తగా, మనవళ్ళకి, మనుమరాళ్ళకి మద్దతుగా నిలిచే నానమ్మగా, అమ్మమ్మగా, భర్త కష్టసుఖాలలో భాగమౌతూ బంగారు భవిష్యత్‌కు దారిచూపే భార్యగా మహిళ పాత్ర అమోఘం, అపూర్వం. ఇంటికి వెలుగునిచ్చే దీపం కావాలన్నా, దారి చూపే దివిటీ కావాలన్నా, సంసార సాగరాన్ని నడిపించే చుక్కాని అవ్వాలన్నా... అది మహిళకే సాధ్యం.

2లో





సమర్ధతకి సత్కారం
ప్రతిభా పురస్కారం




అక్షిత హాస్పిటల్ నిర్వాహకులు,
ప్రముఖ జీర్ణకోశ, లివర్, ప్యాన్‌క్రియాజ్ వ్యాధి
(గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్) నిపుణులు
నెల్లూరుతో పాటు సమీప జిల్లాలలో కూడా
అగ్రగణ్యుడిగా రాణిస్తున్న వైద్య ప్రముఖులు,
మా కుటుంబానికి అత్యంత ఆప్తులు,
రత్నం మాస్టారి శిష్యులు
డాక్టర్ వై.పవన్‌కుమార్‌రెడ్డి గారు
అత్యంత ప్రతిష్టాత్మకమైన




'టైమ్స్ ఆఫ్ ఇండియా' ప్రతిభా పురస్కారాన్ని
కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి
కే.రామ్మోహన్‌నాయుడు గారి
చేతుల మీదుగా అందుకున్న ఆనంద తరుణంలో
మా అభినందన శుభాకాంక్షలు.

డాక్టర్ కే.కృష్ణకిషోర్ - వాసంతి
డాక్టర్ కిషోర్స్ రత్నం విద్యాసంస్థలు
ఆంధ్రప్రదేశ్.

# బాకాలు.. బాకీలు

(మొదటిపేజీ తరువాయి)

అలివిమాలిన విధ్వంసం. అంతులేని వినాశనం. కుప్పకూలిన వ్యవస్థలు. అంపశయ్యపైకి చేరిన ఆర్థికరంగం. దేశంలో రుణ సేకరణ సామర్థ్యం సున్నాగా ఉన్న ఏకైక రాష్ట్రం ఏపీ. రెండో ప్రపంచ యుద్ధంలో అణుబాంబులు పడిన హీరోషీమా, నాగసాకి భౌతికంగా కకావికలం అయితే, జగన్ ప్రభుత్వం అప్పుల కుప్పలు, లెక్కకుమిక్కిలి తప్పులతో ఆర్థికంగా ఆంధ్రప్రదేశ్ అవసాన దశలో కొట్టుమిట్టాడుతోంది. దీన్ని కాపాడేందుకు మెట్టుమెట్టు పేర్చి అతికష్టంపై ఊపిరిపోసే ప్రయత్నం చేస్తున్నాం... అంటూ బీద అరుపులు.

ఇలా మాకు తిరుగులేదంటూనే, కూలిపోయేలా ఉన్నామని చెప్పడం. పరుగులో మా సత్తా చూపుతామంటూనే, కింద పడిపోయామనడం. అభివృద్ధిలో ఆకాశమంత అంటూనే... ఆపసోపాల పాఠం అప్పజెప్పడం పయ్యావులకే చెల్లింది. అందుకే కూటమి ప్రభుత్వ బడ్జెట్ అటు గొప్పలు చెప్పే బాకాలు.. ఇటు కలవరపెట్టే బాకీలతో.. రక్తికట్టించిందనే వాదనలు వినిపిస్తున్నాయి.

## దూషణలు..
## సొంత డబ్బాకే పరిమితం..

నిజానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 2025 – 26 బడ్జెట్ కొందరి మోదం, కొందరికి ఖేదం కలిగించింది. అయితే ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాత్రం ప్రతిపక్షాన్ని ఎండగడుతూనే తమనేత దృఢ సంకల్పంతో ఎంతటి విపత్కర పరిస్థితుల నుంచైనా బయటపడుతామంటూ ధీమా వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ చర్యలతో రాష్ట్ర అభివృద్ధి తిరోగమన దిశలో ప్రయాణించిందని, ఆర్థిక ఆరాచకం కారణంగా ప్రజాస్వామ్య వ్యవస్థలు దెబ్బతిన్నాయని, ముఖ్యంగా రాష్ట్ర యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక దిక్కుతోచని స్థితిలోకి చేరిపోయిందని తమ విత్తపుస్తకంలో తీవ్ర విమర్శలు చేశారు. జగన్ ప్రభుత్వం ప్రజాసంక్షేమాన్ని మరిచి కక్షసాధింపు చర్యలకు పాల్పడిందంటూ ఆరోపణలు గుప్పించారు. ఇక 2024 ఎన్నికల్లో అవినీతి, అసమర్థ పాలనకు చరమగీతం పాడి, వారి జీవితాలతోపాటు వారి పిల్లల భవిష్యత్ కోసం ప్రజలు కూటమి ప్రభుత్వానికి జైకొట్టారని అభిప్రాయపడ్డారు. 93 శాతం సీట్లు, 57 శాతం ఓట్లతో కనీవినీ ఎరుగుని ఘన విజయాన్ని సొంతం చేసుకున్నామని, గత జగన్ ప్రభుత్వ దుష్టపాలనపై తాము అధికారంలోకి వచ్చిన వెంటనే శ్వేత పత్రాలు విడుదల చేశామని వెల్లడించారు. తద్వారా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రజలందరికీ బట్టబయలు చేశామని తెలిపారు. ధైర్యం, దార్శనికత, ఆశావాద దృక్పథానికి తమ నేత చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్ అని, సంస్కర్త, విధానకర్త అయిన తమ అధినేత సారథ్యంలో, డబుల్ ఇంజిన్ సర్కార్ ఏపీ అభివృద్ధిని వాయువేగంతో ముందుకు తీసుకెళ్తుందని, నభూతో న భవిష్యతి అనే రీతిలో రాష్ట్రం ముందడుగు వేస్తుందన్నారు. దీంతో బడ్జెట్ కేటాయింపుల్లో అంకెలు రంకెలేస్తాయని, పథకాలు పట్టాలెక్కుతాయని అందరూ భావించారు. అయితే సూపర్ సిక్స్‌పథకాలకు పెద్దగా కేటాయింపులు లేకపోవడంతో ఇది గారడీ బడ్జెట్ అంటూ విమర్శిస్తున్నారు.

## ఆరు పథకాల అమలుపై
## స్పష్టత ఏదీ?

ఇక సూపర్ సిక్స్ పథకాల విషయాని కొస్తే తల్లికి వందనం ఈ ఏడాది మే నెల నుంచి అమలు చేస్తామని ప్రకటించారు. కానీ కేటాయింపులు మాత్రం 9,407 కోట్లకే పరిమితం చేశారు. ఈ పథకానికి కనీసం 13 వేల కోట్లయ్యే అవకాశం ఉంది. అయితే, ఆమేరకు నిధులు కేటాయించకపోవడంతో లబ్ధిదారుల సంఖ్యలో కత్తిరింపులు ఉండే అవకాశం ఉంది. అలాగే అన్నదాత సుఖీభవకు రూ. 6,300 కోట్లే ప్రకటించారు. ఇక ప్రతిమహిళకు ప్రతినెలా రూ. 1500 అందించే ఆడబిడ్డ నిధి, యువతకు 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి పథకాల ఊసే బడ్జెట్‌లో కనిపించలేదు. దీనిపై సామాన్య, మధ్యతరగతి ప్రజలు పెదవి విరిస్తున్నారు. ఇంకెంతకాలం సాగదీస్తారంటూ మండి పడుతున్నారు. హామీలను నమ్మి అధికారం కట్టబెడితే తాత్సారమే ధ్యేయంగా కాలం సాగదీస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

## గేమ్ ఛేంజర్‌కు నిధులెక్కడ?

ఇక భవిష్యత్‌లో ఏపీ నీటి పారుదల రంగానికి చుక్కానిగా, అసలైన గేమ్ ఛేంజర్‌గా కూటమి ప్రభుత్వం ప్రకటించిన గోదావరి – బనకచర్ల ప్రాజెక్టుకు బడ్జెట్‌లో నిర్దిష్ట కేటాయింపులు లేకపోవడం విశ్లేషకులను సైతం ఆశ్చర్యపరిచింది. ఇదే సమయంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఈ ప్రాజెక్టుపై కేంద్రానికి ఫిర్యాదు చేయడం గమనార్హం. గోదావరి, కృష్ణానదిలలో నీటి కేటాయింపులు లెక్క తేలకముందే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి–బనకచర్ల ప్రాజెక్టును ఏకపక్షంగా ఎలా ప్రకటిస్తుందని ఆయన ప్రశ్నించారు. నీటి కేటాయింపుల లెక్కలు కొలిక్కివస్తేనే మిగులుజలాలపై స్పష్టత వస్తుందని, అప్పటి వరకు ఆ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని ఆయన కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు విన్నవించారు. దీంతో గోదావరి–బనకచర్ల ప్రాజెక్టుపై నీలినీడలు అలుముకునే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

మార్గదర్శి, దీర్ఘదర్శి, విజనరీ అయిన చంద్రబాబు మార్గదర్శకత్వంలో ఆంధ్ర ప్రదేశ్ పురోగమిస్తోందంటూ బడ్జెట్‌లో ప్రకటించిన పయ్యావుల, కీలకమైన ద్రవ్య లోటు విషయంలో మాత్రం ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడం గమనార్హం.

## వారిని విమర్శిస్తూ..
## మళ్లీ అదే దారిలో..

గతంలో వైఎస్ జగన్ ప్రభుత్వం అతి సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చి భవిష్యత్ అవసరాలను పూర్తిగా పక్కనపెట్టిందని, అందుకే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కుంటుపడిందని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టీడీపీ, జనసేన పార్టీలు విమర్శించాయి. రాష్ట్రం మొత్తం ఆదాయాన్ని కేవలం రోజువారీ నిధులకే ఖర్చుచేస్తున్నారని తద్వారా ఉత్పత్తి కారకాలపై చేసే వ్యయం పూర్తిగా తగ్గిపోయిందని ఆరోపించాయి. కానీ అధికారంలోకి వచ్చాక ఈ ప్రభుత్వం కూడా రోజువారీ అవసరాలు, జీతాలు, రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్లు, సంక్షేమ పథకాల కోసం చేసే రెవెన్యూ వ్యయాన్ని మొత్తం బడ్జెట్‌లో రూ. 2.51 లక్షల కోట్లుగా ప్రకటించడం గమనార్హం. భూమి, యంత్రాలు, పరిశ్రమలు, పెట్టుబడులకు సంబంధించిన మూలధన వ్యయాన్ని కేవలం 40 వేల కోట్లకే పరిమితం చేయడంపై విమర్శలు వస్తున్నాయి. మూలధన వ్యయాన్ని భారీగా తగ్గించి భవిష్యత్‌లో జీడీపీ, తలసరి ఆదాయం ఎలా పెంచుతారని ఆర్థిక వేత్తలు ప్రశ్నిస్తున్నారు. ఈ కేటాయింపులు స్వర్ణాంధ్ర విజన్–2047కి బలం చేకూర్చకపోగా పరోక్షంగా విఘాతం కలిస్తాయని వ్యాఖ్యానిస్తున్నారు. ఇక సామదాన భేద దండోపాయాలతో ఆదాయం పెంచి, అప్పులు తెచ్చైనా ఖర్చుకు వెనుకాడకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని, బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించిన కూటమి ప్రభుత్వం ప్రస్తుతం దేశంలో అప్పుపుట్టని, రుణసామర్థ్యం సున్నాకు చేరిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఉందంటూ ప్రకటించడం కొసమెరుపు.

---

**FORM IV**
(See Rule 8)

Statement about Ownership and other Particulars about News Paper, **Lawyer (Weekly)**

| | | |
|---|---|---|
| 1. Place of Publication | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 2. Periodicity of its Publication | : | Weekly |
| 3. Printer's Name | : | Thunga Siva Prabhath Reddy |
| Nationality | : | Indian |
| Address | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 4. Publisher's Name | : | Thunga Siva Prabhath Reddy |
| Nationality | : | Indian |
| Address | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 5. Editor's Name | : | Thunga Siva Prabhath Reddy |
| Nationality | : | Indian |
| Address | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 6. Name and Address of individuals who own the News Paper and Partners or share holders holding more than one percent of the total Capital | : | Thunga Siva Prabhath Reddy |
| Nationality | : | Indian |
| Address | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |

I, Thunga Siva Prabhath Reddy hereby declare that the particulars given above are true to the best of my Knowledge and belief.

(Sd)

01.03.2025 SIVA PRABHATH REDDY.T

---

# ఆడాళ్ళూ.. మీకు జోహార్లు..

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యంగా భారతదేశంలో మహిళపాత్ర అనన్యసామాన్యం అంటే అతిశయోక్తి కాదు. నాటి గార్గేయ, ఝాన్సీలక్ష్మీభాయ్, సరోజినినాయుడు, దేశాన్నేలిన ఇందిరాగాంధీ, అంతరిక్షయానం చేసిన కల్పానాచావ్లా, సునీత విలియమ్స్ వరకు ఎంతోమంది మహిళామణులు భారతీయఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశారు. అందుకే వారి సేవలు అజరామరం. రేపటి మహిళలకు వారి మార్గం అనుసరణీయం.

## అన్నిరంగాల్లో తగ్గేదేలే అంటూ..

మనదేశంలో ద్రవిడులు, తర్వాత వచ్చిన ఆర్యుల కాలంలో ఇంటిపెద్దగా మహిళలే ఉంటూ మగవారికి మార్గనిర్దేశం చేసేవారు. మాతృస్వామ్యం తర్వాతికాలంలో పితృస్వామ్యంగా రూపాంతరం చెందింది. కాలక్రమేణా మహిళలకు విద్యా, ఉపాధి కరువయ్యాయి. రాజకీయ, సేవారంగాల్లో వారిపాత్ర నామమాత్రంగా మారింది. దీంతో మహిళలు వంటింటికే పరిమితమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. అయితే కాలక్రమేణా వచ్చిన మార్పులు మహిళలను అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలబెడుతున్నాయి. ముఖ్యంగా విద్యారంగంలో అమ్మాయిలదే అగ్రస్థానం. పది, ఇంటర్, డిగ్రీ, పీజీ లాంటి వార్షిక పరీక్షలైనా, ఉద్యోగ నియామకాల్లో అయినా వారిదే ఆధిపత్యం. అత్యధిక మార్కులు, టాప్ ర్యాంకులు వారికే. ఇక అత్యధిక వేతనాలు తీసుకునే డాక్టర్లు, లాయర్లు, ఇంజినీర్లు, న్యాయశాఖల్లో మహిళలు పెద్దసంఖ్యలో సత్తాచాటుతున్నారు. రాజకీయరంగంలో వారి ఉనికి కొంత తక్కువే అయినా గతంలో ఉత్తరప్రదేశ్‌లో మాయావతి, తమిళనాడులో జయలలిత, ప్రస్తుతం పశ్చిమబెంగాల్‌లో మమతాబెనర్జీ, తాజాగా ఢిల్లీలో రేఖాగుప్తా ముఖ్యమంత్రుల స్థాయికి చేరుకుని సత్తాచాటుతున్నారు. సోనియాగాంధీ దేశరాజకీయాల్లో గతంలో ఓ వెలుగువెలిగారు. ఇక ఆంధ్రా, తెలంగాణల్లోనూ పలువురు మహిళలు రాజకీయ రంగాల్లో ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా, మంత్రులుగా ఉత్తమ సేవలందిస్తున్నారు. సినీరంగంలోనూ తమదైన ముద్రవేస్తున్నారు. పారిశ్రామిక వేత్తలుగా వ్యాపారరంగంలోనూ రాణిస్తున్నారు. ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు.

## ఆపదొస్తే అబల కాదు.. శివంగిగా మారాలి

ఎంత టెక్నాలజీ వచ్చినా, ఎన్ని చట్టాలు వచ్చినా, ఎంత అక్షరాస్యత ఉన్నా, మహిళలంటే కొందరి మగాళ్లలో చులకన భావం ఇంకా అలాగే కనిపిస్తోంది. వారిని ఇష్టారాజ్యంగా వేధించడమే కాకుండా ప్రాణాలను హరించేందుకు కూడా కొందరు వెనుకాడడం లేదు. స్కూళ్ళు, కాలేజీలు మొదలు, పనిచేసేచోట, పబ్లిక్ ప్రదేశాల్లో వారిపై దాడులు, అఘాయిత్యాలు నిత్యకృత్యంగా మారుతున్నాయి. కొన్నిసార్లు అయినవారు, బంధువులే రాబందుల్లా వారి జీవితాలను చిదిమేస్తున్నారు. చిన్నారులను సైతం వదిలిపెట్టకుండా మద్యం మత్తులోనే, కామోద్రేకం తలకెక్కో ఘోరాలకు తెగబడుతున్నారు. ఇక నిర్భయ, అభయ, దిశ, మృగాళ్ల చేతిలో అసువులు బాస్తున్న మహిళల పేరుతో ప్రభుత్వం తీసుకొస్తున్న కఠిన చట్టాలు ఇవి. అయినా, అలివిమాలిన అహంకారం నింపుకున్న కొందరు నరరూప రాక్షసులు అబలల పాలిట యముళ్లుగా మారుతున్నారు. అందుకే ఈ పరిస్థితిని మార్చి శిశువుగా స్వేచ్ఛగా పుట్టిన బిడ్డ సకల సౌకర్యాలతో, జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించే గొప్ప సమాజాన్ని, సమానత్వాన్ని మన దేశంలో తీసుకురావాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉంది. దీనికి ఇంటి నుంచి శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉంది. తల్లిదండ్రులు అన్ని అంశాల్లోనూ మగ బిడ్డను, ఆడబిడ్డను సమానంగా చూడాలి. వివక్ష చూపకుండా వారికి విద్యాబుద్ధులు నేర్పించాలి, ఇతరులను గౌరవించే సంస్కృతిని పెంపొందించాలి. అలాగే చిన్నతనం నుంచే ప్రతి కుటుంబంలో మానవతా విలువలను తెలియజేయాలి. తద్వారా ఇతరుల పట్ల జాలి, దయ వంటివి చూపేలా ప్రోత్సహించాలి. ముఖ్యంగా మగ పిల్లలను ఇతరుల అభిప్రాయాలను గౌరవించే విధంగా పెంచాలి. వారికి చిన్నా, పెద్ద, గురువు, దైవం అనే భావనను బాల్యంలోనే తెలియజేయాలి. ఆ దిశగా ప్రభుత్వాలు కూడా ఆలోచించి పాఠ్య ప్రణాళిక, బోధనా ప్రక్రియల్లో దాన్ని భాగం చేసినప్పుడే సమాజంలో పశుత్వాన్ని అంతమొందించే అవకాశం ఉంటుంది. ఇలాంటి చర్యల ద్వారా మగపిల్లలు యుక్త వయస్సు వచ్చాక మహిళలపై అఘాయిత్యాలకు తెగబడకుండా ఉంటారని సైకాలజిస్టులు చెబుతున్నారు. అలాగే ప్రతి ఆడబిడ్డకూ స్వీయరక్షణ కోసం కరాటే, కుంగ్‌ఫూ, మార్షల్‌ఆర్ట్స్‌లో శిక్షణ ఇవ్వాలని సూచిస్తున్నారు.

## మహిళా రక్షణకు శక్తి యాప్..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దిశయాప్ పేరుతో మహిళల కోసం కొన్ని ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఆపదలో ఉన్న మహిళలు ఈ యాప్ ద్వారా సమీపంలోని పోలీసు రక్షణపొందేందుకు అవకాశం కల్పించింది. అయితే, అస్తవ్యస్త నిబంధనలతో దిశ చట్టం పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. పైగా ప్రభుత్వం కూడా దిశచట్టాన్ని రూపొందించి తర్వాత మిన్నకుండి పోయిందని, అందులోని అంశాల సాధ్యాసాధ్యాలను, పట్టించుకోలేదనే విమర్శలూ వచ్చాయి. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం మహిళా దినోత్సవం (మార్చి 8వ తేదీ) రోజున శక్తి యాప్‌తో ఆంధ్రప్రదేశ్‌లో మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలను చేపట్టబోతోందని హోంశాఖ మంత్రి అనిత ఇటీవల శాసనసభలో ప్రకటించారు. తద్వారా నెట్‌వర్క్ లేని నిర్మానుష్య ప్రాంతాల్లోనూ మహిళలు విపత్కర పరిస్థితుల్లో రక్షణ పొందేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు శక్తియాప్‌ను లాంఛనంగా ప్రారంభిస్తారని ఆమె వెల్లడించారు. ఏదేమైనా భారతావనిలో తల్లిగర్భం నుంచి కాటికెళ్లే ముదుసలి వరకు మహిళ అనేక స్థాయిల్లో అవస్థలు, అవమానాలు పడుతూనే ఉంది. ఈ దుస్థితి మారి ప్రతిఆడబిడ్డలో అమ్మను చూసే సంస్కృతి మనదేశంలో పురుడు పోసుకోవాలని, స్వేచ్ఛగా, సంతోషంగా తనకు నచ్చిన రంగంలో రాణించి ఉన్నతస్థాయికి ఎదగాలని, అవకాశాల్లోనూ, అధికారంలోనూ, అంతరిక్షంలోనూ మగాళ్లతో సై.. అంటే సై అనే స్థాయికి భారతీయ మహిళలందరూ చేరుకోవాలని ఆకాంక్షిస్తూ , మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ ప్రత్యేక కథనం భారతీయ మహిళలకి అంకితం. ఆడాళ్ళూ.. మీకు జోహార్లు!




## రవాణాలో మేటి... తనకి తానే సాటి

# న్యూ మంగళూరు పోర్టుకి ఉత్తమ అవార్డు

భారతదేశంలో ఉన్న 22 మేజర్ మరియు మైనర్ పోర్టులలో జరిగిన జల రవాణా విభాగంలో మన నెల్లూరీయుడు డాక్టర్. ఏ.వీ.రమణ సారధ్యంలో నడుస్తున్న న్యూ మంగళూరు పోర్టు దేశంలోనే ద్వితీయ స్థానం పొంది "ఉత్తమ రవాణా పోర్టు"గా అవార్డు సాధించింది.

మార్చి 27న ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో, కేంద్ర పోర్టులు, షిప్పింగ్, మరియు జలరవాణా శాఖల మంత్రి సర్బానంద సోనువాల్ చేతులమీదుగా ఈ ప్రతిష్టాత్మక అవార్డుని న్యూ మంగళూరు పోర్టు అధారిటీ ఛైర్మెన్.. మన నెల్లూరు వాసి డాక్టర్ అక్కిరాజు వెంకటరమణ అందుకున్నారు. దేశం మొత్తంలో మన తెలుగువాడి సారధ్యంలో నడుస్తున్న పోర్టుకి, అదీ మన నెల్లూరీయుడి నాయకత్వానికి ఈ అవార్డు రావడం అభినందనీయం.

## జగనన్న ఇళ్ల పేరుతో..

# భారీస్థాయిలో గోల్మాల్!

- 34.5 లక్షల మేరకు..ఇసుకను దోచేశారు
- విజిలెన్స్ విచారణతో..అక్రమాలు బట్టబయలు
- ఒక అధికారి సస్పెండ్..మరికొందరికి షోకాజ్‌లు

ఎట్టకేలకు గత వైకాపా ప్రభుత్వంలో జరిగిన ఇళ్ళ కాలనీల నిర్మాణాల్లో అక్రమాలకు పాల్పడిన 'గోల్మాల్ గోవిందయ్య'లకు కానికాలం వచ్చేసింది. కూటమి ప్రభుత్వం రాకతో రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడెక్కడ ఎలాంటి అవినీతి జరిగిందో లెక్కలన్నీ చూస్తున్నారు. నెల్లూరుజిల్లాలో కూడా గృహనిర్మాణశాఖలో జరిగిన అక్రమాలను నిగ్గ తేలుస్తున్నారు. అక్రమాలకు పాల్పడ్డారంటూ వచ్చిన ఫిర్యాదులను ఆధారం చేసుకుని కూటమి ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించడంతో అక్రమార్కులు బెంబేలెత్తుతున్నారు. ప్రత్యేకించి నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని జగనన్న లేఅవుట్లలో ఇళ్ళ నిర్మాణాలకు సంబంధించి దాదాపు 34.5 లక్షల వరకు ఇసుక దోపిడీ జరిగిపోయినట్లు అధికారులు గుర్తించారని సమాచారం. అదేవిధంగా, సర్వేపల్లి నియోజకవర్గంలోని మనుబోలు మండలంలో కూడా భారీస్థాయిలో ఇసుకను మింగేశారని, సుమారు 16 లక్షల రూపాయల విలువైన ఇసుకను స్వాహా చేశారని అధికారుల పరిశీలనలో తేలినట్లు తెలుస్తోంది. పలుచోట్ల ఇళ్ళు కట్టకుండానే పాత ఫోటోలు చూపించి, పెద్దఎత్తున డబ్బును స్వాహాచేసినట్లు భోగట్టా.

### అక్రమార్కులపై చర్యలు ప్రారంభం..

విజిలెన్స్ నివేదికల ఆధారంగా, గృహనిర్మాణశాఖలో పలువురు అవకతవకలకు పాల్పడిన అధికారులపై ఆ శాఖ ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఈనెల 5వ తేదీన నెల్లూరు గృహనిర్మాణ సంస్థ ఏఇ మధుసూదన్‌రావును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులివ్వడం సంచలనంగా మారింది. అదేవిధంగా, ఇసుక స్వాహాలకు తెరతీసిన మరికొందరికి షోకాజ్ నోటీసులు కూడా జారీ అయ్యాయి. గతంలో ఆ శాఖ ఇన్‌చార్జి ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేసిన నాగరాజుతో పాటు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దయాకర్, ఏఇలు జమీర్, వెంకటేశ్వర్లుకు కూడా షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. ఈ వ్యవహారాలన్నిటి మీదా విజిలెన్స్ విచారణలు మరింత లోతుగా జరగబోతున్నాయని తెలియడంతో అవినీతిపరుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. అప్పట్లో స్వాహాలకు పాల్పడిన అధికారులు ఒకవేళ రిటైరైపోయి ఉన్నా సరే, విచారణకు హాజరు కావాల్సి ఉండడంతో ఆ శాఖలోని పూర్వపు అధికారులు కూడా ఎప్పుడు ఎవరికి ఎలాంటి తాఖీదు వస్తుందోనని నిద్రలేని రాత్రులు గడుపుతున్నట్లు తెలియవస్తోంది.

## కొండ బిట్రగుంటలో..9 నుంచి బ్రహ్మోత్సవాలు

బోగోలు మండలం కొండ బిట్రగుంటలో వెలసి ఉన్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో మార్చి 9 నుంచి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. 9న గిరిప్రదక్షిణ, అంకురార్పణ, 10న ధ్వజారోహణం, శేషవాహనసేవ, 11న హనుమంత సేవ, 12న మోహిని ఉత్సవం, గరుడసేవ, 13న మొక్కుబడులు, తెప్పోత్సవం, గజవాహన సేవ, 14న కల్యాణోత్సవం, రథోత్సవం, అశ్వవాహనసేవ అనంతరం ధ్వజావరోహణం ఉంటాయి. 15న పుష్పయాగం, స్వామివారికి ఏకాంతసేవ నిర్వహిస్తారు. భక్తులు తరలివచ్చి స్వామివారి కృపను పొందాలని ఆలయ అధికారులు కోరుతున్నారు.



# ఆక్రమణల అడ్డాగా అన్నమయ్య సర్కిల్!

## నేలని తాకట్టు పెట్టి నెల బాడుగ దండుకుంటున్నారు!

***నగరంలోని మినీబైపాస్ (రాజీవ్ రహదారి)లో ఉన్న అన్నమయ్య కూడలి ఆక్రమణలకు అడ్డాగా మారిపోయింది. అక్రమ సంపాదనకి అలవాటు పడ్డ కార్పొరేషన్ సిబ్బందికి అన్నమయ్య సర్కిల్ ఆదాయ వనరుగా తయారయ్యింది. నేల(రోడ్డు మార్జిన్)ని తాకట్టుపెట్టి కార్పొరేషన్ సిబ్బంది నెల బాడుగలు దండుకుంటున్నారు. నిబంధనలకి నీళ్లొదిలి నిలువునా దోచుకుంటున్నారు. రాజకీయ నాయకుల అండతో ఇవి నడుస్తున్నాయనే ప్రచారం మాటున గుట్టు చప్పుడు కాకుండా తమ జేబులు నింపుకుంటున్నారు.***



ఓ వైపు శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్యులవారి విగ్రహం, మరోవైపు శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయం, ఇంకో వైపు ఇస్కాన్ మందిరాలతో అత్యంత విశాలమైన ఆధ్యాత్మిక కూడలిగా ఏర్పడిన అన్నమయ్య సర్కిల్ అక్రమ ఆక్రమణలతో క్రమేణా కుదించుకు పోతోంది. ఇక్కడ ఓ వైపు పూర్తిగా నిబంధనలకి విరుద్ధంగా, కనీస పార్కింగ్ వసతి కూడా లేకుండా నిర్మించిన హోటల్ ట్రాఫిక్‌కి పెద్ద ప్రతిబంధకంగా తయారయ్యింది. తమ హోటల్‌కి వచ్చే వాహనాల పార్కింగ్ కోసం.. రోడ్డు మార్జిన్‌నే ఈ హోటల్ నిర్వాహకులు ఉపయోగించుకుంటున్నారు. ఆ హోటల్ పక్కనే వున్న టీ స్టాల్‌కి వచ్చే తేనీటి ప్రియులు కూడా తమ ఇష్టారాజ్యంగా అడ్డదిడ్డంగా సగం రోడ్డుని ఆక్రమించి వాహనాల్ని నిలిపేస్తున్నారు. మరోవైపు గత ప్రభుత్వ హయాంలో ఇక్కడ విజయా డైరీ పేరుతో ఒక దుకాణాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఆ దుకాణాన్ని ఆనుకుని రోడ్డు మార్జిన్‌లో ఒక్కొక్కటిగా కొత్త అంగళ్ళు పుట్టుకొస్తున్నాయి. ఆధ్యాత్మిక కూడలిగా ప్రసిద్ధి చెందిన అన్నమయ్య సర్కిల్ ఆక్రమణల అడ్డాగా మారిపోతోంది.

### రూ.2 కోట్లతో.. ఎన్.టీ.ఆర్ పార్కులో బాలు స్మారకం ప్రశ్నార్థకమేనా..?

అన్నమయ్య కూడలి ఎదురుగా వున్న ఎన్.టీ.ఆర్ పార్కులో అన్నమయ్య విగ్రహం ఎదురుగా భారతీయ సినిమా గాయకులు, నెల్లూరీయుల గానాల పట్టి ఎస్.పీ.బాలసుబ్రహ్మణ్యం విగ్రహంతో పాటు ఆయన స్మారకాన్ని ఏర్పాటు చేయడానికి ఓ అజ్ఞాత దాత ముందుకు వచ్చారు. అందుకోసం 2కోట్లు వెచ్చించడానికి ఆ దాత ముందుకొచ్చారు. ప్రఖ్యాత ఆర్కిటెక్టుని పిలిపించి డ్రాయింగులు కుడా సిద్ధం చేశారు. కానీ, ఇక్కడ ఏర్పడిన దుకాణాలు ఆ దాత ఆలోచనలకి ప్రతిబంధకాలుగా మారడంతో ఆయన వెనక్కి తగ్గారు. దీంతో 'బాలు స్మారకం' ప్రశ్నార్థకమయ్యింది.

### నేతలూ, అధికారులూ చొరవ చూపాలి!

ఈ కూడలిని అందంగా తీర్చిదిద్దడానికి ఇటు నేతలూ, అటు అధికారులూ చొరవ చూపాలి. రెండో మూడో దుకాణాలు తొలగించినందువల్ల పెద్దగా ఓట్ల నష్టం జరగదు. కాబట్టి, రాజకీయ నేతలు ఇక్కడ ఓట్లని చూడకుండా అన్నమయ్య కూడలి పవిత్రతని, ప్రాముఖ్యతని దృష్టిలోపెట్టుకోవాలి. అవకాశం ఉన్న మేరకి అత్యంత అందమైన కూడలిగా ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దడానికి చొరవచూపాలి. అధికారులు కూడా తమ స్వార్థం పక్కనపెట్టి ఈ కూడలి అభివృద్ధిపై దృష్టిపెట్టాలి. పోలీసుశాఖ సైతం తమ ఇష్టానుసారం వాహనాలని రోడ్డుకి అడ్డంగా పార్కింగ్ చేస్తున్నవారికి భారీ జరిమానాలు విధించి కట్టడిచేయాలి. అడ్డదిడ్డంగా వాహనాలు నడిరోడ్లపై పార్క్ చేయకుండా నియంత్రించాలి. అన్ని విభాగాల సమిష్టికృషితో అన్నమయ్య కూడలిని విశాలంగా, అందంగా తీర్చిదిద్దాలి. నమో వెంకటేశాయ..!



లాయర్
మార్చి 07, 2025

# తరుగుతున్న ఆత్మీయతలు.. పెరుగుతున్న ఆత్మహత్యలు

భర్త పెట్టే బాధలు భరించలేక ఓ ఇల్లాలు ఉరి వేసుకుంది. భార్య అలిగి పుట్టింటికి వెళ్ళిపోయిందనే మనస్తాపంతో పురుగుల మందు తాగేశాడో భర్త. దీర్ఘకాలంగా ఉన్న వ్యాధిని తట్టుకోలేక ఓ వృద్ధుడు రైలు కిందపడి జీవితం చాలించుకున్నాడు. ప్రేమ ఫలించలేదనే ఆవేదనతో ఓ ప్రియురాలు చెరువులో దూకేసింది. కుటుంబంలో కలతలు పెరిగి జీవితం మీద విరక్తి పెంచుకుని వళ్ళు కాల్చుకుని మరణించిందో అభాగ్యురాలు. పరీక్షల్లో పాసు కాలేదనే వ్యధతో ఓ విద్యార్థిని తన గదిలో ఫ్యానుకు వేలాడింది..ఇలాంటి దీనగాథలు మనం రోజూ ఎక్కడోచోట వింటూనే ఉన్నాం. ఔను!..సమాజంలో ఇలాంటి బలవన్మరణాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. అటు వ్యక్తిగత సమస్యలు, ఇటు కుటుంబ కష్టాలు, మరోవైపు మానసిక వేదనలు, ఒంటరితనం అన్నీ కలిసి వెరసి అనునిత్యం ఎంతో మంది ప్రాణాలు తీస్తూనే ఉన్నాయి. ఈ భూమ్మీద అన్ని జీవరాశుల్లోనూ మానవజన్మ ఎంతో గొప్పదని, భగవంతుడిచ్చిన ఆ జీవితాన్ని చేజేతులా మనకు మనమే చాలించుకోవడం మహా పాపమని ప్రాచీనశాస్త్రాలు చెప్తున్నాయి. కష్టాలు ఈ రోజుంటాయి..రేపటికి పోతాయి. ఈలోగానే క్షణికావేశంతో ప్రాణం తీసుకోవడం వల్ల ఒరిగేదేముంటుంది?.. బిడ్డలు ఆత్మహత్య చేసుకుంటే ఆ తల్లితండ్రుల గర్భశోకం ఎవరు తీర్చగలరు?...ఎవరు అర్ధాంతరంగా జీవితాన్ని ముగించుకున్నా, వారిని నమ్ముకున్న వారి వేదనారోదనలను ఎవరు ఆర్చగలరు?..అని పెద్దలు పదేపదే హెచ్చరిస్తుంటారు కూడా. అయినా, ఎవరు పట్టించుకుంటున్నారు కనుక!..ఎవరి బాధలు వారివి..ఎవరి లోకం వారిది అన్నట్లుగా ఉంటోంది నేటి తరం వారి జీవనశైలి. మనసులో బాధలని ఎవరికైనా చెప్పుకుందామన్నా వినేవారు ఉండడం లేదు. పూర్వంలో అలా కాదు, కుటుంబంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా తామున్నామంటూ కుటుంబసభ్యులంతా ధైర్యం చెప్పేవారు. రోజూ కాసేపు అందరూ కలసి ఎవరి పరిస్థితి ఎలా ఉందో మాట్లాడుకునేవారు. ఏ సమస్యనుండి ఎలా బయటపడాలో తెలియజేసేవారు. ఇప్పుడలా కాదు, పెద్దలు పిల్లలతో మాట్లాడడానికి తీరిక ఉండడం లేదు. పిల్లలకు పెద్దలతో మాట్లాడేందుకు ఇష్టపడడం లేదు. అసలు, జీవితమన్నది జీవించడానికే తప్ప మరణించడానికి కాదు. ఉండేదే ఒకే ఒక్క జీవితం. దానిని మనకు మనమే పోగొట్టుకోవడం దారుణం!..అలా ఆత్మహత్యలు చేసుకుంటున్నవారి సంఖ్య మనదేశంలో మరింత ఎక్కువగానే ఉండడం గమనార్హం. భారత్‌లో ఏటా లక్షలాదిమంది బలవన్మరణాలకు బలైపోతున్నారని, ప్రతిఏడాదీ ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయే తప్ప తరగడమే లేదని నిపుణులు లెక్కలు కట్టి మరీ చెప్తున్నారు. ప్రపంచంలోని సగటు ఆత్మహత్యలతో పోలిస్తే భారత్‌లో ఆ సంఖ్య రెట్టింపుగానే ఉంటోందని, దేశంలో రోజుకు సుమారు 160 మంది వరకు యువకులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, గంటకు 14 మంది వంతున బలవంతంగా చనిపోతున్నారని జాతీయ గణాంకాలు చెప్తున్నాయి. 2018లో మనదేశంలో లక్షా 34వేల మంది, 2019లో లక్షా 39వేల మంది, 2020లో లక్షా 53 వేల మంది, 2021లో లక్షా 64వేల మంది ఆత్మహత్యలు చేసుకున్నారని, ఒక్క 2022లోనే లక్షా 70 వేలా 921 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని, ఇది 2021 కంటే 4.2 శాతం ఎక్కువని జాతీయ నేరగణాంక రికార్డులు తేటతెల్లం చేస్తున్నాయి. కూలిపనులు చేసుకుని జీవించే కష్టజీవులు ఇందులో 26.4 శాతం మంది ఉన్నారని, బలన్మరణాలు పొందిన గృహిణుల సంఖ్య 11.4 శాతం మంది ఉన్నారని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. తీవ్రమైన మానసిక సమస్యలు, ఆర్థికపరమైన కష్టాలు, ప్రధానంగా పేదరికం..నిరుద్యోగం మనదేశంలో బంగారంలాంటి యువతను బలిగొంటున్నాయి. తగ్గని జబ్బులు, తీరని అప్పులు, ఫలించని ప్రేమలు, గృహహింసలు, లైంగిక వేధింపులు, ఒకరిపై ఒకరికి అనుమానాలు, వరకట్నాల వేధింపులు, మద్యం-మాదకద్రవ్యాల వంటి వ్యసనాలు..ఇలా అనేక కారణాలు బలవన్మరణాలకు దారితీస్తున్నాయి. ఇకనైనా, ఈ దుస్థితి నుంచి మనదేశం బయటపడాలి. ఏ సమస్యకైనా చావు పరిష్కారంకాదని తెలుసుకోవాలి. ఆమేరకు ప్రభుత్వాలు, స్వచ్ఛంధసంస్థలు ప్రజలను చైతన్యవంతులను చేయాలి. ఆత్మవిశ్వాసంతో విజయాలు సాధించాలే తప్ప.. ఆత్మహత్యలు దేనికీ పరిష్కారం కాదని తెలియజెప్పాలి. చిన్నతనం నుంచే పిల్లలకు ఆత్మస్థైర్యం నింపాలి. కుటుంబ బంధాలు బాగా బలపడినప్పుడు ఇలాంటి అనర్థాలకు చోటుండదు. అందరూ అనురాగంతో, ఐకమత్యంతో జీవించినప్పుడు.. అసలు ఆత్మహత్యల ఊసే ఉండదు. జీవితాన్ని నూరేళ్ల పంటగా పండించుకోవాలనే తపనతో ఉంటే, బలవన్మరణాలకు తావుండదు. ఏమంటారు?...




## విజ్ఞానాన్ని మింగేస్తున్న అజ్ఞానం!

తరాలు మారుతున్నాయి. కాలం మారుతోంది. ప్రపంచమంతటా ఆధునిక శాస్త్ర పరిజ్ఞానం పెరిగిపోతోంది. అయినా.. ఇంకా మనం బావిలో కప్పల్లానే ఉన్నాం. ఆధునికతని అందుకోలేకపోతున్నాం. అవును, ఇది ముమ్మాటికీ నిజం. ఎవరు అవునన్నా, ఎవరు కాదన్నా ప్రస్తుత సమాజంలో జరుగుతున్న కఠోర నిజం. ఓ వైపు అత్యంత ఆధునికమైన శాస్త్రవిజ్ఞానంతో విశ్వరహస్యాలను సైతం కనిపెట్టే స్థాయికి చేరుకొని, రాకెట్ల ప్రయోగంలో రాకెట్టువేగంతో ముందుకుపోతున్నాం. మరోవైపు, చేతబడులు, క్షుద్రపూజలు, దెయ్యాలు, భూతాలు, మంత్రాలు, చింతకాయలు వంటి మూఢనమ్మకాలతో, అజ్ఞానపు సుడిలో కూరుకుపోతున్నాం.

గాలి సోకింది, దెయ్యం పట్టింది, చేతబడి జరిగింది వంటి పిచ్చి మాటలని మనం ఇంకా విశ్వసిస్తూనే వున్నాం. ఎక్కడైనా ఓ పాత బంగళా కనిపిస్తే.. అందులో దెయ్యం తిరుగుతుందంటే మనం నమ్ముతున్నాం. ఆ దెయ్యాన్ని తరిమేస్తామని ఎవరైనా నకిలీ మంత్రగాళ్ళు చెప్తే.. నిజమే అనుకుంటున్నాం. ఆ మాయగాళ్ళు ఎంత అడిగితే అంతా ఇవ్వడానికి సిద్ధపడిపోతున్నాం. కంటికి రోగమొస్తే.. పంటికి మందిచ్చే నాటు వైద్యుల చెంతకి మనమింకా క్యూలు కడుతూనేవున్నాం. బాల్య వివాహాలు చట్టవిరుద్ధమని మనకి తెలుసు. వాటివల్ల అనారోగ్యసమస్యలు వస్తాయని డాక్టర్లు చెప్తూనే వున్నారు. అయినా అవి ఆగడంలేదు. మారుమూల పల్లెల్లో గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోతూనే వున్నాయి. చిత్ర విచిత్రమైన మనస్తత్వాలు కలిగిన పాతకాలపు మనుషులు ఇంకా ఈ సమాజంలో వున్నారంటే అతిశయోక్తి కాదు. మేనరికపు పెళ్లిళ్ళు చేసుకుంటే, పుట్టేబిడ్డలకి మంచిది కాదని చెవుల్లో ఇల్లు కట్టుకుని చెప్తున్నా.. మేనరికానికి ప్రాధాన్యత ఇచ్చేవాళ్ళు మనమధ్యే మసలుతున్నారు. ఆడపిల్లలకు చదువెందుకని ప్రశ్నించే మూర్ఖపు జనాలు ఈ ఆధునిక సమాజంలో తిరిగేస్తున్నారు. ఆడబిడ్డలు పుడితే దురదృష్టమని భావించేవారికి కూడా నేటి సమాజంలో కరువులేదు. 'దున్న ఈనిందంటే.. గాటిన కట్టేయమన్నట్లు'గా... ఈనాటికీ మనదేశంలో అనేక రకాల మూఢనమ్మకాలు, మూఢాచారాలు అమాయకపు జనాన్ని శాసిస్తూనే ఉన్నాయి. ఏది మంచో.. ఏది చెడో ఆలోచించే జ్ఞానాన్ని సంపాదించుకోవడంలో ఓ వర్గం వెనుకబడే ఉంటోంది. ఇదే అదనుగా, నమ్మకాల పేరుతో వాళ్ళని నిలువు దోపిడీ చేసేవారికీ కొదవలేదు.

### పరిశీలనా దృక్పథం అలవర్చలేకపోతున్న నేటి చదువులు!

మనదేశంలో ప్రాథమిక విద్యలు, ఉన్నత చదువులు కూడా కూటికోసం కోటివిద్య లన్నట్లుగానే ఉంటున్నాయి. ఉద్యోగం కోసం చదువుకోవాలి. పెద్దజీతాలు సంపాదించాలన్న తపనే తప్ప, సమాజానికి ఎంతో ఉపయోగపడే శాస్త్రజ్ఞానం (సైన్స్) పట్ల ఆసక్తి తక్కువైపోతోంది. చిన్నతనం నుంచి అలాంటి పరిజ్ఞానాన్ని పాఠాలు, పాఠశాలలు అందించలేకపోతున్నాయి. సొంతంగా ఏదైనా మంచి ప్రయోగం చేసి ఒక కొత్త ఆవిష్కరణ చేయాలనే ఆలోచన నేటి తరంలో తక్కువగా కనిపిస్తోంది. ఒకవేళ అలా చేయాలన్న తలంపు ఎవరికైనా వచ్చినా అందుకు తగ్గ ప్రోత్సాహం లభించడం లేదు. పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లు కరువైపోయాయి. అటు ప్రైవేటు, ఇటు ప్రభుత్వ పాఠశాలల్లో కూడా సైన్స్‌కి సంబంధించిన పరికరాలు కానీ, ప్రయోగాలు చేయడం నేర్పే వెసులుబాటు కానీ ఆశించిన స్థాయిలో ఉండడం లేదు. శాస్త్రవేత్తల గురించి, వారు చేసిన ప్రయోగాల గురించి వివరించే అయ్యవార్ల సంఖ్య కూడా తక్కువే. అయినప్పటికీ ఎందరో బాల మేధావులు, యువకిశోరాలు, ఆణిముత్యాల వంటి అత్యుత్తమ విద్యార్థులకు మనదేశంలో కొదవలేదు. కానీ, శాస్త్రవిజ్ఞాన పరిజ్ఞానంలో వారిని అన్నివిధాలా ప్రోత్సహించే వ్యవస్థలు కరువైపోయాయి.

### శాస్త్రీయంగా ఆలోచించడం అలవరుచుకోవాలి!

సైన్స్ మానవాళికి ఒక అద్భుత వరం. ఒక్కమాటలో చెప్పాలంటే, ప్రపంచ గమనాన్నే సైన్స్ మార్చేసింది. ఆకాశాన్నంటే సాంకేతిక పరిజ్ఞానంతో అరచేతిలోకి ప్రపంచం వచ్చేసింది. అయితే, అదే సందర్భంలో మరోవైపు మనిషిలో అజ్ఞానం కూడా పెరిగిపోయింది. నిరక్షరాస్యత తదితర కారణాలతో అధికశాతం ప్రజలు అంధకారంలో పడి కొట్టుమిట్టాడుతున్నారు. పేదరికంతో పాటు.. అమాయకత్వం, మూర్ఖత్వం, మూఢనమ్మకం వంటివి వారి అభివృద్ధికి ఆటంకాలుగా అవతరించాయి. ఇకనైనా మేలుకోవాలి. మన ఆలోచనల్లో మార్పురావాలి. ఏదిమంచో ఏది చెడో తెలుసుకోవాలంటే శాస్త్రీయ ఆలోచనా విధానమే సరైన మార్గం. నిజానికి.. నమ్మకం వేరు, మూఢనమ్మకం వేరు. దేన్నయినా ప్రశ్నించి, శాస్త్రీయదృక్పథంతో ఆలోచించగలగాలి. అలాకాక, ప్రతిదాన్నీ గుడ్డిగా నమ్మడం వల్ల ప్రయోజనం శూన్యమే.

ప్రపంచవ్యాప్తంగా ఎందరో శాస్త్రవేత్తలు తమ అద్భుత మేధాశక్తితో ఎన్నోరకాల ప్రయోగాలతో కొత్తకొత్త ఆవిష్కరణలను చేస్తున్నారు. ప్రపంచాన్ని ఆధునికత వైపు నడిపిస్తున్నారు. అలాంటివారిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలి. పాఠ్యపుస్తకాల్లో మూఢనమ్మకాల గురించి వివరించి, శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించే జ్ఞానం పిల్లలకు చిన్నతనం నుంచి అలవడేలా ప్రభుత్వాలు విద్యావ్యవస్థలో మార్పులు చేయాలి. ముఖ్యంగా, నమ్మకానికి అంధ విశ్వాసానికి ఉండే తేడాను గమనించే విధంగా వారిని చైతన్యవంతం చేయాలి. అలా చేసినప్పుడే.. రాబోయే తరంలోనైనా నమ్మకం అన్నది గుడ్డినమ్మకంగా మారకుండా ఉంటుంది.

### మనల్ని మనమే మార్చుకోవాలి!

ఏదేమైనా, మన సమాజాన్ని మనమే మార్చుకోవాలి. విజ్ఞానంతోనే అది సాధ్యం కనుక, అక్షరజ్ఞానంతో పాటు శాస్త్రీయజ్ఞానాన్ని, సాంకేతిక వైజ్ఞానిక పరిజ్ఞానాన్ని కూడా పెంపొందించుకుని మనతో పాటు దేశాన్ని కూడా ప్రగతి బాట పట్టించాలి. ఇకనైనా, చిన్నారుల మెదళ్ళలో సమాజానికి ఉపయోగపడే మంచి ప్రయోగాలు చేయాలనే తలంపు రావాలి. ఆ దిశగా ఆసక్తి ఉన్న విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తయారుచేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లితండ్రులు తమ భుజస్కంధాలపైకి ఎత్తుకోవాలి. విజ్ఞానాన్ని మింగేస్తున్న అజ్ఞానాన్ని పారద్రోలి ఆధునిక శాస్త్ర పరిజ్ఞానంతో విజ్ఞానం ఆధిపత్యం చెలాయించేలా చర్యలు చేపట్టాలి. ప్రభుత్వాలు సైతం ఆ దిశగా ఆలోచించి అడుగులు వేయాలి!

- రాజశ్రీ

## నిజమే.. ఈ తరం తరించింది!


మహా కుంభమేళా గురించి గత వారం మన 'లాయర్'లో రాసిన ప్రతీ పదం అక్షర సత్యం. యావత్ ప్రపంచం నోరెళ్లబెట్టేలా యోగి సర్కారు కుంభమేళా ఏర్పాట్లను చేసింది. ఖచ్చితంగా ప్రపంచంలో మరే దేశానికీ ఇది సాధ్యం కాదు. కేవలం 45 రోజులలో 65కోట్ల మందికిపైగా జన సమూహాన్ని ఒక చోటకి రప్పించగలిగిన ఘనత మహాకుంభమేళా దక్కించుకుంది. బహుశా ఇది ఒక్క హిందుత్వానికే సాధ్యం. మళ్ళీ మహా కుంభమేళా జరిగే వరకూ అంటే మరో 144 సంవత్సరాల వరకూ ఈ మహా కుంభమేళా గురించి భవిష్యత్ తరాలు చెప్పుకుంటాయనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. నిజమే! ఈ తరం తరించింది. భారత్ మాతాకీ జై..! హర హర మహాదేవ...!!

*డి.హరిత*, గూడూరు.

## తుగ్లక్‌ని తలపిస్తున్న డోనాల్డ్ ట్రంప్!

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరో తుగ్లక్‌ని తలపిస్తున్నాడా అన్న అనుమానం కలుగుతోంది. ఒక్కొక్కటిగా ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు విస్మయాన్ని కలిగిస్తున్నాయి. పది లక్షల డాలర్లకి అమెరికా పౌరసత్వాన్ని బహిరంగ మార్కెట్లో ఆయన అమ్మకానికి పెట్టడం ఆయన నైజాన్ని ప్రస్ఫుటం చేస్తోంది. దేశంలో అక్రమంగావున్న ఇతర దేశాల పౌరులని బేడీలు వేసి మరీ వారి దేశాలకి తిరిగి పంపిస్తున్నారు. ఈ చర్యవల్ల ఎక్కువగా అమెరికన్లే ఇబ్బందులు ఎదుర్కొంటారన్న విషయాన్ని ట్రంప్ ప్రభుత్వం గ్రహించడం లేదు. ముఖ్యంగా అమెరికాలోని కార్మిక వ్యవస్థలో ఎక్కువగా మెక్సికన్లే ఉంటారు. ఈ దేశంలోని సంపన్నులు, ఎగువ మధ్యతరగతి కుటుంబాల వారు పూర్తిగా మెక్సికన్లపైన ఆధారపడుతుంటారు. అధికశాతం మెక్సికన్లు అక్రమ చొరబాటుదారులే. ఇప్పుడు వాళ్ళందరినీ బంధించి తరిమేస్తే దేశంలో సాధారణ కార్మికులు కరువైపోతారు. కార్మికుల లోటుని ట్రంప్ ఏ విధంగా భర్తీచేస్తాడో చూడాలి. అలాగే భవన నిర్మాణ విభాగ ముడిసరుకులు కూడా అధిక శాతం ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకోవలసిందే. వాటిపై దిగుమతి సుంకాన్ని అమాంతం పెంచేసింది ట్రంప్ ప్రభుత్వం. ఈ చర్యతో భవన నిర్మాణ వ్యయం కూడా విపరీతంగా పెరిగిపోతుంది. ఇవన్నీ సామాన్య ప్రజలకి నష్టాన్ని కలిగించే అంశాలే. వీటన్నిటినీ ట్రంప్ ఎలా అధిగమిస్తాడో ఆయనకే తెలియాలి.

వై.బి.సత్యనారాయణమూర్తి - శాండియాగో, కాలిఫోర్నియా.




lawyerpatrika@gmail.com
+91 98663 14741

## పోస్టల్ శాఖలో ప్రక్షాళన జరగాలి!

సిబ్బంది కరువో, లేక ఉద్యోగం బరువో తెలియదు కానీ, పోస్టల్ శాఖ బట్వాడా ఉద్యోగులలో చిత్తశుద్ధి తగ్గింది. ఆ శాఖ ఉద్యోగులు గతంలోలాగా విధులు నిర్వహించడం లేదు. తపాలా బట్వాడాలో బాగా ఆలస్యం జరుగుతోంది. ఒక్కొక్క సారి అసలు డెలివరీయే జరగడంలేదు. ప్రజలకి పోస్టల్ శాఖపై వున్న నమ్మకం సన్నగిల్లుతోంది. ఈ విషయంపై తపాలా శాఖ అధికారులు దృష్టిసారించాలి. అపార చరిత్ర కలిగిన తపాలా వ్యవస్థ కనుమరుగయ్యే పరిస్థితి రాకుండా అధికారులు చర్యలు చేపట్టాలి. ఎక్కడెక్కడ లోపాలు న్నాయో గుర్తించి సరిదిద్దాలి. ముఖ్యంగా తపాలా బట్వాడాలో ఆలస్యం, లేదా అలసత్వం లేకుండా బట్వాడా సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించాలి. ఆ శాఖలో పదవీవిరమణ పొందిన సీనియర్ల సహకారం తీసుకుని పరిస్థితులు గాడినపెట్టాలి.

ఆర్.పి.రామయ్య, కొండాయపాలెం.

## అవి కాలనీలు కాదు..
# జగనన్న పేకమేడలు



### - సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి

రాష్ట్రంలో గత వైకాపా ప్రభుత్వం చేపట్టిన జగనన్న కాలనీలు కేవలం పేకమేడలుగానే మిగిలిపోయాయని, అప్పట్లో అన్ని వ్యవస్థలను జగన్ సర్వనాశనం చేశారని, కూటమి ప్రభుత్వం తిరిగి రాష్ట్రాభివృద్ధికి బాటలు వేయాలని సర్వేపల్లి ఎమ్మెల్యే, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అసెంబ్లీ సమావేశాల్లో గళమెత్తారు. జగనన్న కాలనీల పేరుతో వైసీపీ పాలనలో చేసిన అక్రమాలు, అవినీతికి లెక్కేలేదన్నారు. అమాయ కులైన గిరిజనులు, నిరుపేదలకు సంబంధించిన ఇళ్ల నిర్మాణ బాధ్యతలను కాంట్రాక్టర్లకు అప్పగించారన్నారు. వరిగొండలో అత్యంత నాసిరకంగా ఇళ్ల నిర్మాణం జరిగిందని, వాటిని తాను సందర్శించానని, అక్కడి పరిస్థితులను చూస్తే విస్తుపోవాల్సి వచ్చిందని చెప్పారు. అసలు, పిల్లర్లు లేకుండా, తగినంత సిమెంట్ కలపకుండా తాకితే కూలిపోయేలా గోడలు నిర్మించారని, వేలకోట్లు కాంట్రాక్టర్లకు దోచిపెట్టారని, ఆ వేల కోట్లు ఏ ప్యాలెస్‌కు చేరివుంటాయనేది జగమెరిగిన సత్యమని ఆయన తూర్పారబట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక, ఈ బడ్జెట్‌లో వ్యవసాయానికి కేటాయింపులు బాగున్నాయంటూనే, రాష్ట్రంలో అధోగతిలో ఉన్న జలవనరుల వ్యవస్థను బాగుచేయాలన్నారు. వైసీపీ ప్రభుత్వంలో వ్యవసాయం, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ వంటి కీలకశాఖలను పనికిరాకుండా మూతవేయడం చూశామని, తమ ప్రభుత్వం వచ్చాక వాటిపై దృష్టిపెట్టడం శుభపరిణామమని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తే అరునెలలు తిరిగినా డబ్బులు రాక రైతులు ఇబ్బందిపడ్డారని, ఇప్పుడు తమ ప్రభుత్వం రైతులకు రెండురోజులు కూడా తిరక్కముందే చెల్లింపులు చేయడం సంతోషంగా ఉందన్నారు. 'కొందరు వైసీపీ నాయకులు రోజూ వారి పత్రిక, టీవీల్లో ప్రకటనలు గుప్పిస్తున్నారు. వారు చెప్పినవన్నీ అమలు చేశారంట..కూటమి ప్రభుత్వం మాత్రం ఏమీ చేయడం లేదంట'..అంటూ వైకాపా నేత జగన్‌మోహన్‌రెడ్డి తీరుపై ఆయన విమర్శనాస్త్రాలు సంధించారు. 'మన బిడ్డ జగనన్న సంపూర్ణ మద్యపాన నిషేధం విధించాడా?.. వారంలో సీపీఎస్ రద్దు చేస్తానన్నాడు.. చేశాడా?.. ఏటా జాబ్ కాలెండర్ విడుదల చేశాడా?. ఏటా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి టీచర్ పోస్టులు భర్తీ చేశాడా? పోలవరం ప్రాజెక్టు పూర్తి చేశాడా? మూడు రాజధానులు కట్టేస్తానన్నాడు.. కట్టేశాడా? అంటూ సోమిరెడ్డి వైకాపాపై ప్రశ్నల వర్షం కురిపించాడు. వాటన్నింటి సంగతేమో కానీ, 50 మందికిపైగా వైకాపా వారిని సలహాదారులుగా నియమించి, వారికి కేబినెట్ ర్యాంకులిచ్చి ప్రజల సొమ్ముతో సకల సౌకర్యాలు కల్పించారని, చివరికి వారిచ్చిన సలహాలతో 11 సీట్లకు పరిమితమైపోయారని ఆయన ఎద్దేవా చేశారు.

## అసెంబ్లీలో గళమెత్తిన..
# నెల్లూరు నేతలు

ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో నెల్లూరుసీమకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు తమదైన శైలిలో గళమెత్తారు. వైకాపా వైఫల్యాలను ప్రస్తావిస్తూ, కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధిని కొనియాడుతూనే, జిల్లాలోని తమ నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు నిధులు మరింతగా కేటాయించాలని కోరారు. తమ ప్రాంతాల్లో ఉన్న పలు సమస్యలను ఏకరువు పెడుతూ, అసెంబ్లీలో ఆయా ప్రాంతాల సమస్యలను ప్రస్తావించారు. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, హ్యాట్రిక్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలు ఎంతో అనుభవంతో తమ నియోజకవర్గాల్లో సమస్యలను అసెంబ్లీకి తెలిపారు. కొత్తవారైనప్పటికీ కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌లు కూడా తమ నియోజవర్గాల సమస్యలను బాగా వివరించారు.

# ఆ రెండు కలుజులపై వంతెనలు అత్యవసరం

### - నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో పొట్టేపాలెం, ములుముడి కలుజులకు వంతెనలు నిర్మించాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అసెంబ్లీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కలుజులపైనే నిత్యం వేలాది వాహనాలు వెళ్తుంటాయని, అయితే వంతెనలు లేకపోవడంతో నిరంతరం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయని ఆయన చెప్పారు. పొట్టేపాళెం మీదుగానే ఇటు నెల్లూరుజిల్లాలోని ప్రాంతాల వారే కాక, అటు ఉదయగిరి ప్రాంతం, కడప జిల్లా ప్రాంతాల నుంచి కూడా వాహనాల రాకపోకలు సాగుతుంటాయని, వంతెన లేకపోవడంతో ప్రయాణాలకు ఎంతో ఇబ్బందిగా ఉంటోందని ఆయన తెలిపారు. ఈ రెండు కలుజుల వద్ద ఎంతో కాలంగా వంతెనలు లేక ప్రజలు బాధలు పడుతున్నారని, ప్రభుత్వం పరిశీలించి వంతెనలు నిర్మించాలని ఆయన కోరారు. ఈ ప్రాంతాల్లో ఎన్నో ప్రముఖ పుణ్యక్షేత్రాలు, దర్గాలు ఉన్నాయని, ఆ పుణ్యస్థలాలకు వెళ్ళే యాత్రికులకు ఈ కలుజులపై వంతెనలు లేకపోవడంతో అసౌకర్యంగా ఉందని అన్నారు. ఈ వంతెనల నిర్మాణానికి 7 కోట్ల రూపాయలు వ్యయమవుతాయని, ఆ నిధులను మంజూరు చేస్తే నెల్లూరు జిల్లా ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# గండిపాళెం ప్రాజెక్టుకు ప్రత్యేక నిధులివ్వండి

### - ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల



ఉదయగిరి నియోజకవర్గంలోని 8 మండలాల్లో 6 మండలాల్లో రైతులు పంటలు పండించుకునేందుకు వర్షంపై ఆధారపడాల్సి వస్తోందని, లేదంటే బోర్ల ద్వారా సాగుచేసుకుంటుంటారని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అసెంబ్లీలో చెప్పారు. దేవుడిదయ వల్ల ఈసారి వర్షాలు బాగా కురిశాయన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలోని గండిపాళెం ప్రాజెక్టు 1.8 టీఎంసీల సామర్థ్యంతో ఉందని, 16వేల ఎకరాల ఆయకట్టు ఉందని అంటూ, రైతులకు ఎంతో ఉపయోగకరమైన ఈ ప్రాజెక్టు అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, ఈ నియోజకవర్గంలో 149 చెరువులుంటే, గత ప్రభుత్వ హయాంలో వాటిని నిర్లక్ష్యం చేయడంతో నీటినరులన్నీ దెబ్బతిన్నాయని, దాదాపు 55 వేల ఎకరాల ఆయకట్టు ఉన్నా రైతులు పంటలు పండించుకోలేకపోతున్నారని, ఈ నేపథ్యంలో ఆ చెరువులు, కాలువలను బాగుచేసుకునేందుకు ప్రభుత్వం అత్యవసర నిధులను కేటాయించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## మత్స్యకారుల కోసం..
# మినీ జెట్టీల నిర్మాణం చేపట్టాలి

### - కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



కోవూరు నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఇటీవలే తొలిసారి గెలిచిన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కూటమి ప్రభుత్వం వచ్చాక జరిగిన తొలి బడ్జెట్ సమావేశంలో ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్నిర్మాణమే ధ్యేయంగా ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌పై ఆమె ప్రశంసలు కురిపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి సారధ్యంలో రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందంటూ, చంద్రబాబు పాలనాదక్షతను ఆమె ఈ సందర్భంగా కొనియాడారు. బడ్జెట్ కేటాయింపుల్లో భాగంగా నెల్లూరుజిల్లాకు 2025-26 ఆర్థిక బడ్జెట్‌లో భారీ కేటాయింపులు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. తమ కోవూరు నియోజవర్గంలోని కొడవలూరు మండలంలో ఉన్న కిసాన్‌సెజ్‌కు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఇఫ్కో కిసాన్ సెజ్, ఏపీఐఐసీ భూములతో పాటు కోవూరు షుగర్ ఫ్యాక్టరీకి చెందిన 100 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములు అందుబాటులో వున్నాయని, ప్రభుత్వం చొరవచూపి ఎంఎస్ఎంఇల కింద ప్రోత్సాహకాలు అందిస్తే స్థానికంగా పరిశ్రమల స్థాపనద్వారా యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు దక్కుతాయని ఆమె సూచించారు. అటు రాయలసీమ జిల్లాలు మొదలుకొని ఇటు నెల్లూరు, ప్రకాశం జిల్లాల వరకు రైతులు వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించుకునేందుకు మెగా అగ్రికల్చర్ యార్డ్ ఏర్పాటు చేయాలని ఆమె ఈ సందర్భంగా కోరారు. నెల్లూరు జిల్లాలోని సముద్రతీర ప్రాంతంలో ఇసుక మేట కారణంగా మత్స్యకారులు సముద్రంలోనికి పడవలు తీసుకెళ్లేందుకు అవస్థలు పడుతున్నారని, తీరప్రాంతమంతా డ్రెడ్జింగ్ చేయడం ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడంతో కోవూరు నియోజకవర్గ పరిధిలోని సముద్రతీర ప్రాంతంలో మినీ జెట్టీల నిర్మాణం చేపట్టి మత్స్యకారులను ఆదుకోవాలని కోరారు. గత ప్రభుత్వ తీరువల్ల నెల్లూరుజిల్లాలో దశాబ్దాల చరిత్ర కలిగిన ఎన్నో ఎయిడెడ్ కళాశాలలు మూతపడ్డాయని, జిల్లా కేంద్రంలో మహిళా డిగ్రీ కళాశాల మాత్రమే ఉందని, విద్యార్థులకు డిగ్రీ కళాశాల లేకపోవడంతో ప్రైవేట్ విద్యా సంస్థల్లో చదవడం పేద విద్యార్థులకు భారంగా మారిందని ఆమె అసెంబ్లీ దృష్టికి తీసుకువచ్చారు. జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల లేదని, విక్రమ సింహపురి యూనివర్సిటీలో ఇంజనీరింగ్, ఫార్మా కళాశాలలకు అనుమతులు వచ్చినా గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఏర్పాటు కాలేదన్నారు. విక్రమ సింహపురి యూనివర్సిటీలో ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలలను ఏర్పాటు చేసి జిల్లాలో ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని, టీచింగ్, నాన్ టీచింగ్ విభాగాలలో ఖాళీలను భర్తీ చేయాలని ఆమె విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ని కోరారు. దాదాపు 2వేల మంది విద్యార్థులు విద్యనభ్యసించే విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో తాగునీటి సమస్యను పరిష్కరించడంతో పాటు ఒక హెల్త్ సెంటర్‌ని కూడా ఏర్పాటు చేయాలని ఆమె కోరారు.

# 24 గంటల్లోనే రైతులకు ధాన్యం డబ్బులు

ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు 24 గంటల్లోనే ధాన్యం డబ్బులు జమ అవుతుండడంతో రైతులు ఎంతగానో సంతోషపడుతున్నారు. ఇటీవల ఆత్మకూరు నియోజకవర్గం సంగం మండలంలో పర్యటించిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో ధాన్యం విక్రయించే రైతులకు 24 గంటలు కంటే ముందుగానే ధాన్యం డబ్బులు చెల్లిస్తామని ప్రకటించారు. ఆమేరకు సంగం ప్రాథమిక వ్యవసాయ కోపరేటివ్ సొసైటీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు కంఠాబత్తిన శ్రీహరిరెడ్డి, వినోద్‌రెడ్డిలు ఈ నెల 1న 258 బస్తాల బిపిటి రకం ధాన్యాన్ని పుట్టి రూ. 19770/- చొప్పున విక్రయించారు. అందుకు

### హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

సంబంధించిన 1,25,280 రూపాయలను రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ కేవలం 24 గంటల్లోనే చెల్లించడంతో రైతులు ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రైతులందరూ కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని మద్దతు ధరకు ధాన్యం విక్రయించి, సకాలంలో డబ్బులు పొందాలని అధికారులు సూచించారు. జిల్లా కలెక్టర్ ఆనంద్ సూచనల మేరకు జాయింట్ కలెక్టర్ కార్తీక్ కూడా జిల్లాలో ముమ్మ రంగా పర్యటిస్తూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 298 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. దళారులకు తక్కువ ధరకు ధాన్యం అమ్ముకోకుండా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించు కోవాలని అన్నదాతలకు అవగాహన కల్పించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.



# వక్తృత్వ పోటీలు

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళల్లో ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం ఈనెల 4న విద్యార్థినులకు నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో వక్తృత్వ పోటీలు నిర్వహించారు. జిల్లా అదనపు ఎస్పీ సిహెచ్ సౌజన్య, నగర డీఎస్పీ సింధుప్రియ, మహిళా పీఎస్ సిఐ సుబ్బారావు, డీటీసీ సిఐ నాగేశ్వరమ్మ, వెల్ఫేర్ ఆర్ ఐ రాజారావు తదితరులు పర్యవేక్షించారు.

## వచ్చే విద్యా సంవత్సరం నుంచే...
# వీఆర్ హైస్కూలు



ఎట్టకేలకు నెల్లూరులో చరిత్రాత్మకమైన విఆర్ హైస్కూలు పున:ప్రారంభం కాబోతోంది. దీనిని మళ్ళీ ప్రారంభించడంతో పాటు, అత్యాధునిక వసతులతో విఆర్ కళాశాలను తిరిగి ప్రారంభిస్తామని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ హామీ ఇచ్చారు. ఇటీవల ఆయన విఆర్ హైస్కూల్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్, నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ, నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి తదితరులతో కలిసి సందర్శించారు హైస్కూల్ పునర్నిర్మాణానికి అవసరమైన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ, 1979లో విఆర్‌సిలో మొత్తం 6500 మంది విద్యార్థులు ఉండేవారన్నారు. 2014లో తాను మంత్రిగా ఉన్న సమయంలో 300 మంది విద్యార్థులతో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. గత ప్రభుత్వం కళాశాలను మూసివేసి నాశనం చేసిందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కళాశాలను కూడా ప్రారంభిస్తామని మంత్రి చెప్పారు.

# రంగనాథునికి గరుడసేవ



గరుడపంచమిని పురస్కరించుకుని ఈనెల 4న నెల్లూరులోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథస్వామికి గరుడసేవ ఉత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. తొలుత స్వామి వారికి, అమ్మవార్లకు విశేష పూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ మంచికంటి శ్రీనివాసులు, ఇఓ ఆళ్ళ శ్రీనివాసులురెడ్డి ఈ వేడుకను పర్యవేక్షించారు.

# నవోదయం సదస్సు



నెల్లూరులోని సర్వోదయ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈనెల 4న జిల్లా ఎక్సైజ్ అధికారుల ఆధ్వర్యంలో నవోదయం-2.0 సదస్సు నిర్వహించారు. ఎక్సైజ్‌శాఖ డీసీ టి. శ్రీనివాసరావు పాల్గొని మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. వాటి నిరోధానికి చేపడుతున్న చర్యల్లో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆ శాఖ ఇ.సి జగదీశ్వర్‌రెడ్డి, ఇన్స్‌పెక్టర్ పి.రమేష్‌బాబు, కళాశాల కరెస్పాండెంట్ హేమచంద్రరావు, ఎక్సైజ్ ఎస్‌ఐలు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## డా.కిషోర్స్ రత్నం స్కూల్ వార్షికోత్సవంలో..
# అలరించిన శాస్త్రీయ నృత్యాలు



నెల్లూరులోని డా.కిషోర్స్ రత్నం పాఠశాలల సప్తమ సంస్కృతి వార్షికోత్సవం ఇటీవల వేడుకగా జరిగింది. ప్లేక్లాస్, యుకేజీ చిన్నారులు శాస్త్రీయ నృత్యాల దుస్తులు ధరించి కలశం, నటరాజు ప్రతిమతో, మంత్రపుష్ప ఉచ్ఛారణతో వేదిక మీదకి రావడంతో బాలలంతా హర్షధ్వానాలు చేశారు. విద్యార్థులు నృత్యాలతో ప్రేక్షకులకు కనువిందు చేశారు. విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు ఈ కార్యక్రమాలకు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. డా.కిషోర్స్ రోషిణి రత్నం హైస్కూల్ విద్యార్థులు నృత్యప్రదర్శనలు నిర్వహించారు. విద్యాసంస్థల ఏఓ తుహీనా, వాణి, సునీల్, ఖాసిం, మేనేజర్లు రాజేష్, అజయ్‌సింగ్, ప్రధానోపాధ్యాయురాలు కల్యాణి, రోహిణిలతో పాటు ప్రేమకుమార్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అలరించిన 'కృష్ణ గానమంజరి'



నెల్లూరులోని భారతీ సంగీత విద్యాలయం 17వ వార్షికోత్సవ వేడుక ఈనెల 2న స్థానిక టౌన్‌హాలులో వీనులవిందుగా జరిగింది. విద్యాలయం అధినేత్రి అనంతభొట్ల రమాదేవి సారథ్యంలో, ఆమె శిష్యబృందంలోని 28 మంది విద్యార్థులు పలు సంకీర్తనా గానాలను, భజన గీతాలను కర్నాటక భక్తి సంప్రదాయ రీతిలో అద్భుతంగా ఆలపించి ప్రేక్షకుల కరతాళధ్వనులందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణనామం హాలంతా మార్మోగింది. ఏవీఆర్ కిశోర్ వ్యాఖ్యానం ఆద్యంతం అందరినీ ఆకట్టుకుంది. కీబోర్డు సంగీత్ సౌరభ్, వయోలిన్ రాయప్రోలు సుబ్రహ్మణ్యం, మృదంగం కళాధర్, ఘటం ఈశ్వరపాయ్‌లు వాద్య సహకారం అందించారు. అనంతరం కంచికామకోటి పీఠం ఆస్థాన విద్వాంసులు, ముల్లైవాసల్ డా.జి.చంద్రమౌళిని ఘనంగా సన్మానించారు. శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేత బయ్యా రవికుమార్ దంపతులు, కళాంజలి గౌరవాధ్యక్షులు వీరిశెట్టి హజరత్‌బాబు, నలుబోలు బలరామయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు. కళాంజలి అనంత్, దువ్వూరు బెనర్జీల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం అందరి ప్రశంసలందుకుంది.

# ఉపాధ్యాయ ఖాళీలను ప్రకటించండి

ఈ ఏడాది ఉపాధ్యాయుల బదిలీల డ్రాఫ్ట్‌లో ఖాళీలను వెల్లడించాలని ఏపీటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఏ.సురేంద్రరెడ్డి ఈనెల 4న ఒక ప్రకటనలో కోరారు. ఉపాధ్యాయుల ఖాళీలు, నియామకాలను బ్లాక్ చేయడం సరికాదని, ఖాళీలను బ్లాక్‌చేస్తే విద్యాప్రమాణాలు దెబ్బతింటాయని పేర్కొన్నారు.

# మూలస్థానేశ్వరునికి దవనోత్సవం



నెల్లూరు మూలాపేటలోని శ్రీ మూలస్థానేశ్వర దేవాలయంలో ఈనెల 4న స్వామివారికి వైభవంగా దవనోత్సవం నిర్వహించారు. తొలుత మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, రుద్రహోమాలు చేపట్టి, కన్నులపండువగా పూలంగిసేవ చేశారు. అనంతరం జరిగిన దవనోత్సవాన్ని భక్తులు దర్శించుకున్నారు. ఉభయకర్తలుగా పులిమి మల్లికార్జున్‌రెడ్డి, శిల్పారెడ్డి వ్యవహరించారు. ఆలయ ఇఓ ఏ.వి శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

# లక్ష్యాలు సాధించండి

వైద్యారోగ్యశాఖలో నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని, రోగులకు అందించే వైద్యపరీక్షలు కచ్చితంగా ఉండేలా చూడాలని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ చెప్పారు. ఈ నెల 4న ఆయన నగరంలోని డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్లతో సమావేశమై మాట్లాడారు. క్షయవ్యాధి నివారణకు వ్యాధినిర్ధారణ త్వరగా చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. జిల్లా మలేరియా అధికారిణి హుస్సేనమ్మ,, జిల్లా గణాంక అధికారి సహన, ఏఎంఓ నాగార్జున పాల్గొన్నారు.

# డ్రోన్‌లతో నిఘా

నెల్లూరు నగరంలో పోలీసులు డ్రోన్‌లతో నిఘాను ముమ్మరం చేశారు. నవాబుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలను పోలీసులు ఈనెల 4న డ్రోన్ కెమెరాలతో పరిశీలించారు. ఎక్కడైనా సరే చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని నగర డీఎస్పీ పి.సింధుప్రియ హెచ్చరించారు. సీఐ అన్వర్‌బాషా పాల్గొన్నారు.

# 'శివరాత్రి వైభవం'పై ప్రవచనం



కంచి పరమాచార్యులవారు కంచి కామకోటి పీఠాన్ని అధిరోహించిన పర్వదినం, జగద్గురు శ్రీ ఆదిశంకరాచార్యుల వారు శ్రీ గోవింద భగవత్పాదుల వారివద్ద సన్యాస దీక్ష తీసుకున్న రోజులను గుర్తుచేసుకుంటూ, నెల్లూరులో ఇటీవల స్థానిక పొగతోటలోని ఆదిశంకర ధ్యానమందిరంలో విశేష పూజలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మికోపన్యాసకులు గుడ్లదొన వరప్రసాదరావు పాల్గొని 'మహాశివరాత్రి వైభవం'పై అద్భుతంగా ప్రవచించారు. మహాశివరాత్రికి, మాసశివరాత్రికి ఉన్న తేడాను తెలిపారు. పంచభూతాలకు సంబంధించిన సంస్కృత పేర్ల మొదటి అక్షరాలతో ఎంతో మహిమాన్వితమైన 'నమ:శివాయ' అనే పంచాక్షరి మంత్రం ఆవిర్భవించిందన్నారు. అనంతరం నిర్వాహకులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. చక్రాల వెంకటలక్ష్మీనరసింహం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనంద కుమార్, ప్రముఖ కవిపండితులు విద్వాన్ కోట రాజశేఖర్, దూబగుంట వెంకటేశ్వరరావు దంపతులు, ఎం.ఎం.రామయ్య దంపతులు, చక్రాల వారి ట్రస్ట్ ధర్మకర్తలు, మందిర కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.




# సాయిదర్బార్‌లో.. అగ్నిగుండ మహోత్సవం



నెల్లూరు బాలాజీనగర్ చివర పద్మావతినగర్‌లోని శ్రీ సాయిదర్బార్ అద్దాల మందిరం ప్రాంగణంలో ఇటీవల అగ్నిగుండ మహోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. వేకువజామున నాలుగు గంటల నుండి భక్తులందరూ 'ఓం హర నారసింహా, రంగా రంగా పాండురంగా' అంటూ దైవనామోచ్చారణలతో, సుమారు 500 మంది భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. శ్రీ సాయినాథస్వామి, పాండురంగస్వామిలకు ఈ సందర్భంగా విశేష పూజలు చేశారు. మార్చి 1వ తేదీ రాత్రి నుండి మార్చి 2వ తేదీ ఉదయం వరకు గురువు లక్ష్మీ సాయి ఆధ్వర్యంలో పండరి భజనలు జరిగాయి. పండరిభజనల గురువులు కొల్లపూడి శీను, తులసిరాం సహకారంతో ఈ కార్యక్రమాలు వేడుకగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు 30మంది పండరి భజన గురువులు వారి శిష్య బృందాలతో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీ లక్ష్మీ నరసింహస్వామి అవతారోత్సవం, శ్రీకృష్ణ లీలలు, ఉగ్ర నరసింహస్వామి దండకం అందరిని ఆకట్టుకున్నాయి. సాయిదర్బార్ మందిరం ఛైర్మెన్ మధుసాయి, గౌరవ సలహాదారులు పాబోలు రామ సుబ్బయ్య ఈ ఉత్సవాలను పర్యవేక్షించారు.

# జైపూర్‌లో.. మంత్రి నారాయణ పర్యటన



జైపూర్‌లో ఇటీవల జరిగిన 12వ ఆసియా పసిఫిక్ రీజినల్ సర్క్యులర్ ఎకానమీ ఫోరం సదస్సులో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమీకృత వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ సంస్కరణలకు సంబంధించిన అంశాలను ఈ సదస్సులో చర్చించారు. కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్‌యాదవ్, పలు దేశాల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధించాలనేది ఆంధ్రప్రదేశ్ లక్ష్యమని, స్వచ్ఛభారత్ మిషన్ లక్ష్యంగా స్వచ్ఛాంధ్ర సాధనకు కలిసి ముందుకెళ్తున్నామని ఈ సందర్భంగా మంత్రి నారాయణ తెలిపారు. 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధించాలనేది ఆంధ్రప్రదేశ్ లక్ష్యమన్నారు. స్వచ్ఛభారత్ మిషన్ లక్ష్యంగా స్వచ్ఛాంధ్ర టార్గెట్‌తో ముందుకెళ్తున్నామని, స్వచ్ఛాంధ్ర అనేది 2047 విజన్ డాక్యుమెంట్‌లో కీలక భూమిక పోషిస్తుందని మంత్రి చెప్పారు. పరిశుభ్రత, పర్యావరణ సమతుల్యత, సమగ్ర ఆర్థికవ్యవస్థ స్వచ్ఛాంధ్ర లక్ష్యాలని, వేస్ట్ మేనేజ్‌మెంట్, పొల్యూషన్ కంట్రోల్,వాతావరణ పరిస్థితులు సమతుల్యం చేసుకుంటూ ముందుకెళ్తున్నామన్నారు. 2047 నాటికి జీరో వేస్ట్ క్లైమేట్ రెసిడెన్స్ సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సంతోషం ప్రకటించారు. స్వచ్ఛాంధ్ర అనేది కేవలం పరిశుభ్రత మాత్రమే కాదు, భవిష్యత్తు తరాలకు నీరు,భూమిని పరిరక్షించాలనే ప్రతిజ్ఞ అని ఆయన చెప్పారు. అమరావతి నిర్మాణంలో కూడా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉత్తమ పద్ధతులను అవలంభిస్తున్నారని ఆయన వివరించారు.



# కోవూరుకి నిధులివ్వండి

## లోకేష్‌కు ప్రశాంతిరెడ్డి విజ్ఞప్తి

కోవూరు నియోజకవర్గం అభివృద్ధికి తగు నిధులివ్వండని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మంత్రి నారా లోకేష్‌కు విజ్ఞప్తి చేశారు. ఇటీవల అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు వెళ్లిన సందర్భంగా ఆమె నారా లోకేష్‌ను కలిసి బడ్జెట్ కేటాయింపులపై మాట్లాడారు. కోవూరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిపనులకు, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేయించేందుకు అవసరమైన నిధులను కేటాయించాలని ఆమె లోకేష్‌ను కోరారు.

# విపిఆర్ లేఖకు స్పందించిన..రైల్వే జీఎం

## పలు రైల్వేస్టేషన్లలో సమస్యలు పరిష్కారం

నెల్లూరు జిల్లా పరిధిలోని రైల్వేస్టేషన్లలో నెలకొన్న సమస్యలపై దక్షిణ మధ్య రైల్వే స్పందించి పరిష్కరించింది. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆ విషయాలపై రాసిన లేఖకు, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ స్పందించారు. వెంటనే ఆ సమస్యలను పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. కందుకూరు నియోజకవర్గం గుడ్లూరు రైల్వేస్టేషన్‌లో నీటి సమస్యలు, కావలి రైల్వేస్టేషన్ పరిధిలో చెత్త తరలింపు, వర్షాకాలంలో నీటి లీకేజీలు, ట్యాప్ కనెక్షన్లు, స్టేషన్ పరిధిలో బెంచీల ఏర్పాటు, ప్రయాణికులు కూర్చునేందుకు సరైన వసతులు లేకపోవడం వంటి సమస్యలను విపిఆర్ ప్రస్తావించారు. ఇక నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ పరిధిలో జరుగుతున్న పనుల్లో వేగం పెంచాల్సిన ఆవశ్యకతను ఆయన తన లేఖ ద్వారా తెలియజేశారు. అపరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని లేఖలో పేర్కొన్నారు. దాంతో పాటు మనుబోలు రైల్వే స్టేషన్ పరిధిలో ఉన్న సమస్యలను కూడా ఆయన ప్రస్తావించారు. ప్రయాణికుల అవసరార్థం వెంటనే వాటిని పరిష్కరించాలని ఎంపీ కోరారు. ఎంపీ వేమిరెడ్డి ప్రస్తావించిన సమస్యలను పరిశీలించిన జీఎం అరుణ్ కుమార్ జైన్ సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేసి ఆ సమస్యలను పరిష్కరించినట్లు ప్రత్యేక లేఖ విడుదల చేశారు. ప్రయాణికులకు ఎక్కడా అవస్థలు లేకుండా చూస్తామని, సిబ్బందిని కూడా అప్రమత్తం చేసి మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

# కేంద్రమంత్రితో కాకర్ల భేటీ



కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ని ఈనెల 2న అమరావతిలో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. నెల్లూరు జిల్లాలో వెనుకబడిన మెట్ట ప్రాంతమైన ఉదయగిరి అభివృద్ధికి సహకరించాలని కాకర్ల కోరగా, అందుకు తమ వంతు సహాయ సహకారాలు తప్పక అందిస్తామని కేంద్రమంత్రి హామీ ఇచ్చారు.

# 9 నుంచి 20 వరకు... రంగనాథుని బ్రహ్మోత్సవాలు



నెల్లూరులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం...శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి బ్రహ్మోత్సవాలు మార్చి 9 నుంచి 20వ తేదీ వరకు వైభవోపేతంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ మేరకు వార్షిక బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికలను రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ నెల్లూరులోని తమ కార్యాలయంలో ఆవిష్కరించారు. దేవస్థానం ఇఓ ఆళ్ళ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యోగాతోనే ఆరోగ్యం



యోగాసనాలు సాధన చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని, మానసిక వత్తిడులను అధిగమించవచ్చని ఏఎస్పీ సిహెచ్ సౌజన్య తెలిపారు. యోగా, ధ్యానంతో జీవనశైలిలో మార్పులు చేసుకోవచ్చని, ప్రతిఒక్కరూ తమ జీవితాల్లో యోగాను అనుసరించాలని చెప్పారు. ఈనెల 2న నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్‌లో మహిళా పోలీసులకు యోగాసనాలు, మ్యూజికల్ ఛైర్ పోటీలు నిర్వహించారు. యోగా గురువు.. హెడ్‌కానిస్టేబుల్ మురళి పాల్గొని యోగా వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీతో పాటు నగర డీఎస్పీ పి.సింధు, మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్స్‌పెక్టర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసిటీలో ఉత్సాహంగా.. 'స్పేస్ ఆన్ వీల్స్'!



జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల శ్రీసిటీలో ఉత్సాహంగా 'స్పేస్ ఆన్ వీల్స్' ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పలు అంశాలకు సంబంధించిన ఆసక్తికరమైన విషయాలెన్నో తెలుసుకున్నారు. ఇస్రోకు సంబంధించిన సమాచారం అందించడంతో పాటు, అంతరిక్ష సాంకేతికతపై విద్యార్థుల ఆసక్తిని పెంచేందుకు శ్రీసిటీ మరియు శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్(ఎస్‌డిఎస్‌సి)-షార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. రెండు రోజుల ప్రదర్శనలో స్థానిక ట్రిబుల్ ఐటీ, క్రియా విశ్వవిద్యాలయం, అకార్డ్ స్కూల్, చిన్మయ విద్యాలయ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ ప్రదర్శనలో మనదేశం ప్రయోగించిన మొట్టమొదటి ఉపగ్రహ ప్రయోగ వాహనం నుండి తాజాగా అంతరిక్షరంగంలోని ఇటీవలి పురోగతి వరకు వివరించారు. వివిధ ప్రయోగాలు, లాంచ్ ప్యాడ్‌లు, చంద్రయాన్-1, మంగళయాన్, రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్లు, ఇండియన్ రీజనల్ సెన్సింగ్ అప్లికేషన్లు, శాటిలైట్ కమ్యూనికేషన్ టెక్నాలజీలకు సంబంధించిన ఆకర్షణీయ నమూనాలను ప్రదర్శించారు. ఈ నమూనాలను వీక్షించి, వాటి వివరాలను తెలుసుకోవడం ద్వారా విద్యార్థులు మంచి అనుభూతిని, విజ్ఞానాన్ని పొందారు. సంక్లిష్టమైన అంతరిక్ష సాంకేతికతను వివరించడంతో పాటు సైన్స్, సాంకేతికత పట్ల ఆసక్తిని పెంచే రీతిలో విద్యార్థులకు ఈ అవకాశాన్ని కల్పించిన షార్ డైరెక్టర్ రాజరాజన్‌కు ఈ సందర్భంగా శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. షార్ అధికారి కిరణ్ నేతృత్వంలోని బృందం, ఇస్రోకి సంబంధించిన వివిధ ప్రయోగాలను ప్రదర్శనల ద్వారా విద్యార్థులకు విశదీకరించారు. అంతరిక్ష సాంకేతికతలో పరిశోధనలు, కెరీర్ అవకాశాల పట్ల యువకులను ప్రోత్సహించడం ఈ కార్యక్రమం లక్ష్యమని వారు చెప్పారు.






జానకిరామ.. 55

# రామాయణం

- ఊటుకూరు జానకి రామారావు



రామా! నేను వాళ్ళెవరినీ లెక్క చేయను. నిన్ను తొలిసారిగా చూసిన దగ్గరనుండీ మనోభావం చేత నిన్ను భర్తగా అనుకున్నాను.

నా ఇష్టం వచ్చిన చోటికి విహరింపగల శక్తి నాకుంది,

రా! నాతో ఉండు, నా భర్తగా ఉందువుగాని.. ఈ సీతతో నీకేమి పని? ఈ సీత ఆకారం, రూపంలో కూడా వికారంగా ఉంది. నీకు తగినది కాదు, నేనే నీకు తగిన దానను, నన్ను భార్యగా పొందు.

ఈ మనుష్య స్త్రీ ఆకారమేమిటి ఇలా ఉంది? ఈమె పొట్ట లోనికిపోయి అణగి ఉంది, దీనిని తినివేస్తాను నేను.

మనమిరువురం కలిసి దండకారణ్యంలో స్వేచ్ఛగా విహరిద్దాం.. అని పలికింది.

దాని మాటలన్నీ విన్న రామచంద్రుడు చిరునవ్వుతో ఇలా అన్నాడు. రాముడు తన మీద మరులుకొన్న శూర్పణఖను చూస్తూ పూజ్యురాలా! నాకు వివాహమైంది, ఈమె నాకు చాలా ఇష్టురాలైన భార్య. నీవంటి ఆడవాళ్ళకు సవతిపోరు ఎందుకు గానీ, అదుగో అతడు అక్కడున్నాడే వాడు! నా తమ్ముడు లక్ష్మణుడు! భార్య దగ్గర లేనివాడు, పరాక్రమవంతుడు, చూడగానే ఆనందం కలిగించేవాడు, చాలాకాలం నుండి భార్యాసుఖం లేనివాడు. ప్రస్తుతం భార్య అవసరం ఉన్నవాడు. అతడిని సేవించు, నీకు సవతి పోరు ఉండదు.. అని పలుకగా ఆ రాక్షసి రాముని విడచి లక్ష్మణుని వద్దకేగి ఆయనతో "నీ సౌందర్యానికి నేనే తగిన దానను రా! హాయిగా విహరిద్దాం" అని పలికింది.

అప్పుడు లక్ష్మణుడు పరిహాసంగా ఒక చిరునవ్వు నవ్వి ఓ! లోకోత్తరసుందరీ! నేను దాసుడను, అదుగో మా అన్న! ఆయనకు దాస్యం చేస్తున్నాను, నాతోపాటు నీవుకూడా దాసివి అవుతావా... ఆ బాధలు నీకెందుకు గానీ ఆయననే మరొక్కమారు అడుగు, వికృతంగా అణగిపోయిన పొట్టతో భయంకరంగా ఉన్న ఆ ముసలి భార్యను విడిచి నిన్నే చేసుకుని రమిస్తాడు అని వేళా కోళంగా మాట్లాడాడు.

అది నిజమే అని నమ్మి మరల రాముని వద్దకు వెళ్ళి, ఈ వికృత రూపంతో చెడ్డదైన ముసలి భార్య నీకెందుకు? దీనిని ఇప్పుడే నేను తినేస్తాను నాకు సవతి పోరు ఉండదు, అప్పుడు మనమిద్దరం సుఖంగా ఉండవచ్చు అని అంటూ సీతాదేవిని భక్షించడానికి మీదమీదకు రాసాగింది.

అది మీదకు వస్తుంటే సీతమ్మ వణికిపోయింది. వెంటనే రాముడు అడ్డం వచ్చి, లక్ష్మణా అంటూ కేకవేశాడు.

ఇదుగో ఈ రాక్షసులతో మనకు పరిహాసమెందుకు? ఈ రాక్షసి చాలా మదించి ఉంది, దీనిని వికృత రూపుగలదానినిగా చెయ్యి అని పలికాడు.

వెనువెంటనే లక్ష్మణుడు ప్రక్కనే ఉన్న ఒక ఖడ్గాన్ని తీసుకొని శూర్పణఖ ముక్కు చెవులు కోసివేశాడు. ఆ గాయాల బాధకు అది వికృతంగా అరుస్తూ వచ్చినదారినే పారిపోయింది.

వెళ్ళి.. వెళ్ళి ఖరుడి దగ్గర ఆకాశం నుండి రాలిన పిడుగులా పడ్డది. శరీరమంతా రక్తపు ముద్ద అయి పట్టరాని బాధతో రోదిస్తున్న సోదరిని చూసి విషయం ఏమిటి అని అడిగాడు !

నిన్ను ఇలా చేసినవాడు ఎవడు?

విషపు కోరలుగల త్రాచుపామును విలాసంగా చేతివ్రేలి కొనతో పొడిచేవాడెవ్వడు?

అప్పుడు శూర్పణఖ కన్నీళ్లు కారుస్తూ, వారిరువురూ రామలక్ష్మణులనెడివారు. దశరథ మహారాజు పుత్రులు.

చాలా అందంగా, ఇంద్రియనిగ్రహంతో ముని వేషధారులై ఉన్నారు.

వారుదేవతలో, మనుష్యులో నేను చెప్పజాలను.

వారిరువురి మధ్య సకలాలంకార భూషితయై సన్నని నడుము కలిగి ఉన్న అందమైన ఒక స్త్రీ ఉంది, దానివలననే వారిరువురూ నన్ను ఈ విధంగా చేశారు.

వారిని నీవు వధించగా నురుగుతో నిండిన కొత్త రక్తాన్ని త్రాగాలని అనుకుంటున్నాను.

ఇది నిన్ను నేనడిగే మొదటి కోరిక!

వెంటనే ఖరుడు మహాబలవంతులైన పద్నాలుగుమంది యమసమానులైన రాక్షసులను పిలిచి సీతారామలక్ష్మణులను చంపివేయమని ఆజ్ఞాపించాడు.

వారిని వెంటపెట్టుకొని శూర్పణఖ రాముడున్నచోటికి తీసుకుపోయింది.

వారిని చూశాడు రామచంద్రుడు!

లక్ష్మణా నీవు సీతను రక్షిస్తూ ఉండు, నేను వీళ్ళ సంగతి చూస్తాను అని లేచాడు.

రాక్షసులను చూసి, మిమ్మల్ని చంపమని ఋషుల ఆజ్ఞ! మీకు ప్రాణాల మీద ఆశ ఉంటే తిరిగి వెళ్ళండి లేదా అక్కడే నిలవండి అని పలికాడు రామచంద్రుడు.

ఆ రాక్షసులప్పుడు రాముని చూసి...

ఒంటరివాడవు! నీవు మమ్ములనేమిచేయగలవు? మా ప్రభువైన ఖరునకు కోపం తెప్పించి బ్రతుకగలను అనే అనుకుంటు న్నావా! అని అంటూనే వారు పద్నాలుగు శూలాలను ఒకే సమయంలో మహా వేగంగా విసిరారు. వారు విసిరిన మరుక్షణమే అన్నే బాణాలు రాముని ధనుస్సునుండి వేగంగా దూసుకుంటూ వచ్చి ఆ శూలాలను మార్గమధ్యంలోనే ఖండించి వేశాయి.

అర క్షణం కూడా ఆలస్యం చేయలేదు రాముడు! పదునైన మరొక పద్నాలుగు బాణాలు తీసుకొని ప్రయోగించాడు, అవి వారి గుండెలను చీల్చుకుంటూ బయటకు వెళ్ళి ఉరుము వంటి శబ్దం చేస్తూ భూమిలో ప్రవేశించాయి.

ఒక్కసారిగా రక్తం చిప్పిల్లి ప్రవహించగా వారి శరీరాలు తడిసి ఎర్రనై మొదలు నరికిన చెట్ల వలె నేలమీద దబ్బున పడ్డాయి.

ఒక్కసారిగా మహాభయంకరంగా అరుచుకుంటూ మరల ఖరుడి వద్దకు వెళ్ళింది శూర్పణఖ!

ఇప్పుడేకదా నీవెంట మహావీరులైన రాక్షసులను పంపాను ఇంతలోనే ఏమయ్యిందే నీకు మళ్ళా ఏడుస్తున్నావు అని కోపంతో అన్నాడు ఖరుడు.

లేలే నీకేమీ భయంలేదు, నేనున్నాను.. నీకు అధైర్యం వద్దు, ఏమి జరిగిందో చెప్పు అన్నాడు.

అవును ఇంతక్రితమే నీవు నాతో పద్నాలుగు మంది మహాశూరులను పంపావు, కానీ వారందరినీ క్షణకాలంలో చంపివేశాడా మానవుడు. అతని యుద్ధరీతి చూస్తే నాకేదో భయంగా ఉంది.

ఏమో! ఎటునుండి ఏ ప్రమాదం రానున్నదో అని భీతి కలుగుతోంది.

నేను విషాదమనే మొసలి, భయం అనే తరంగాలు కలిగిన దుఃఖం అనే సముద్రంలో మునిగి ఉన్నాను. నన్నెందుకు రక్షింపవు నీవు?

నీకు రాక్షసులయందు జాలి ఉన్నట్లయితే.. ఆ రాక్షస కంటకుడిని ఎదిరించు.

నీకు శక్తీ, తేజస్సు ఉంటే ఆ రాముడిని చంపేసి నా కోపం చల్లార్చు. లేని పక్షంలో నేనిప్పుడే నీ ముందే ప్రాణాలు విడుస్తాను.

నీకు ఆ పని చేతకాకపోతే ఇక్కడనుండి పారిపో అని రెచ్చగొడుతూ పొట్ట బాదుకుంటూ బావురుమని ఏడ్చింది.

అప్పుడు ఖరుడు రోషంతో, శూర్పణఖా ఇదిగో ఇప్పుడే చెపుతున్నాను... ఈ గండ్ర గొడ్డలితోనే వాడి తల నరుకుతాను.

అప్పుడు వాడి కంఠం నుండి పొంగుతూ బయటకు వచ్చే వెచ్చని నెత్తురు ఆనందంగా త్రాగుదువుగాని.....అని అంటూ..

తన సేనాని అయిన దూషణుని వైపు తిరిగి నీవు వెంటనే పద్నాలుగు వేలమంది మహావీరులు, శత్రు భయంకరులు అయిన సైనికులను సిద్ధం చేయి అని ఆజ్ఞాపించాడు.

వీరులైన రాక్షసులు వెంటరాగా రాముడి మీదికి యుద్ధానికి బయలుదేరాడు ఖరుడు.

వాడు బయలుదేరగానే ఆ సైన్యం మీద అమంగళకరమైన రక్తం వర్షించింది.

ఒక పెద్ద రాబందు వచ్చి వాడి ధ్వజాన్ని ఆక్రమించి రథం మీద కూర్చుంది..

ఖరుడి ఎడమ భుజం అదిరింది. అయినా ఇవి ఏవీ లెక్క చేయక రణ ఉత్సాహం ఉప్పొంగుతుండగా ముందుకు కదిలాడు వాడు.

రాముడు కూడా ఖరుడు చూసిన ఉత్పాతాలే చూశాడు. ఈ ఉత్పాతాలు సకల భూత వినాశనాన్ని సూచిస్తున్నాయి... చూశావా లక్ష్మణా అని అన్నాడు.

పక్షుల కూతలు ఒక్కసారి విన్నావా! మనకు ఏదో అపాయం దగ్గరలోనే రాబోతుందనిపిస్తుంది. ఏదో గొప్ప యుద్ధమే జరుగబోతున్నట్లు అదిరే నా భుజం చెపుతోంది.

అయినా శకునాలు అన్నీ మనకు జయాన్నీ, ఎదుటివాడికి అపజయాన్నీ చెపుతున్నాయి.

..(సశేషం)

# న్యాయం జరిగేదెన్నడు?

మనసులో మాట 35

జస్టిస్ డిలేడ్ ఈజ్ జస్టిస్ డినైడ్ అనేది న్యాయశాస్త్రంలో ప్రాధాన్యమున్న నానుడి. న్యాయం చేయడం ఆలస్యమయితే న్యాయం నిరాకరించినట్లే అని అర్థం. ఎవరైనా అన్యాయం జరిగిందని ఆక్రోశిస్తుంటే వారికి సకాలంలో న్యాయం చేయకపోతే న్యాయం చేయడానికి నిరాకరించినట్లే. ఇది కేవలం న్యాయస్థానాల్లో ఉన్న కేసులకు మాత్రమే వర్తించదు. న్యాయప్రక్రియ అనేది న్యాయస్థానాల మెట్లు ఎక్కకముందే ప్రారంభమవుతుంది. వ్యక్తుల స్థాయిలో అయినా, వ్యవస్థల స్థాయిలో అయినా చట్టాన్ని ఆశ్రయించాలి అనే నిర్ణయాన్ని ముందు తీసుకోవాలి. చాలాసార్లు న్యాయం చేయడమనేది చట్టానికి సంబంధం లేని అంశం కూడా. ఈ రెండు అంశాల్లోనూ తెలుగుదేశం పార్టీ వ్యవస్థ స్థాయిలో నిర్ణయం తీసుకోవడంలో విపరీతమైన జాప్యం జరుగుతోందనే భావన పార్టీ కార్యకర్తల్లో విస్తృతంగా ఉంది.

జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో తెలుగుదేశం కార్యకర్తలు చాలా ఇబ్బందులు పడ్డారనేది వాస్తవం. వారిని లక్ష్యంగా చేసుకుని మరీ వైకాపా నేతలు వేధించారు. ప్రభుత్వపరంగానూ వేధింపులు ఎదుర్కొన్నారు. ఆర్థికంగా, భౌతికంగా లక్ష్యంగా చేసుకోవడంతో చాలా మంది తెలుగుదేశం కార్యకర్తలు బాధలను ఐదేళ్ల పాటు పంటిబిగువనా భరించారు. తెలుగుదేశంతో కూడిన కూటమి అధికారంలోకి రావడంతో తమకు న్యాయం జరుగుతుందని ఆశలు పెట్టుకుని ఎదురుచూస్తున్నారు. కానీ వారి గోడు పట్టించుకునే వారు లేరని బాధపడుతున్నారు.

తెలుగుదేశం పార్టీ కార్యకర్తల ఆవేదనకు ఫైబర్ నెట్ ఛైర్మన్ జీవీరెడ్డి రాజీనామా అద్దం పట్టింది. వైకాపా అధికారంలో ఉన్నన్నాళ్లూ ఆ పార్టీని తర్కబద్ధంగా, హేతు బద్ధంగా ఎండగట్టడంలో రాజధాని అమరావతి రైతులకు, అక్కడి మహిళలకు మద్దతుగా ధైర్యంగా గొంతు వినిపించడంలో ఆయన ముందున్నారు. ఆయన కష్టాన్ని గుర్తించి తెలుగుదేశం ప్రభుత్వం మంచి పదవినే ఇచ్చింది. కానీ, ఫైబర్‌నెట్ కార్పొరేషన్‌లో పనిచేసే అధికారులు ఇంకా వైకాపాకు విధేయంగా ఉంటూ సంస్థకు నష్టం కలిగిస్తున్నారన్న సంగతిని పార్టీ అధిష్టానానికి నివేదించాలని ప్రయత్నించినా ఫలితం లేకపోయిందనే ఆవేదనతో ఆయన రాజీనామా చేశారు.

జీవీరెడ్డి ఈ విషయాన్ని బహిరంగంగా ప్రకటించడంతో తెలుగుదేశం అధిష్టానానికి కోపం తెప్పించింది. అధిష్టానానికి దగ్గరగా ఉండేవారు జీవీరెడ్డి వైఖరిని తప్పుపడుతూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులుపెట్టారు. కానీ, అసలు సిసలు తెలుగుదేశం అభిమానులు, కార్యకర్తలు జీవీరెడ్డిని సమర్థిస్తూ పోస్టులు పెట్టడంతో అధిష్ఠానానికి విషయం బోధపడింది. ఆ తర్వాత కొద్దిరోజులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నుంచి ఒక అర్థవంతమైన మాట వినిపించింది. వైకాపా వారికి ఏ స్థాయిలో అయినా సహకరిస్తే పాముకు పాలుపోసినట్లే అని అన్నారు. ఇలా మాటలతో సరిపెడితే చాలదు. ఆచరణలో కనిపిస్తేనే న్యాయం జరిగినట్లు.

జీవీరెడ్డి ఉదంతమే కాదు.. ఇంకా చాలా ఉన్నాయి. చాలా నియోజకవర్గాల్లో తెలుగుదేశం కార్యకర్తలను వేధించిన వైకాపా కిందిస్థాయి నాయకులు ఇప్పటికీ పేట్రేగిపోతున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో పరిస్థితి చూస్తే అధికారంలో ఉన్నది కూటమి ప్రభుత్వమా? వైకాపానా అన్న అనుమానం కూడా వస్తుంది.

వల్లభనేని వంశీ విషయమే తీసుకుంటే తెలుగుదేశం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండగానే ఆ పార్టీ కార్యాలయంలో పని చేసే యువకుడిని అపహరించుకెళ్లి తనకు అనుకూలంగా వాంగ్మూలం ఇప్పించుకున్నారంటే తెలుగుదేశం పార్టీ వ్యవస్థ కానీ, కూటమి ప్రభుత్వంలోని వ్యవస్థకానీ ఎలా పని చేస్తోందో అర్థం చేసుకోవచ్చు. గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి కేసు... ఆ యువకుడిని అపహరించిన తర్వాత కానీ ముందుకు కదల్లేదంటే పార్టీలో న్యాయం ఎంత నత్తనడకన నడుస్తోందో అర్థమవుతుంది. వైకాపా అధికారంలో ఉండగా పేట్రేగిపోయిన తులసిబాబు అనే వ్యక్తి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా గుడివాడలో అధికారపార్టీ శాసనసభ్యుడి వెనక చేరి మొన్నటివరకు అరాచకాలు కొనసాగించాడంటే న్యాయం జరుగుతుందని పార్టీ కార్యకర్తలు ఎలా నమ్ముతారు?

ప్రతీకార రాజకీయాలకు పాల్పడకూడదనేది తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు నమ్మిక. ప్రజాస్వామ్యంలో ఇది ఆదర్శం కూడా. కానీ ప్రతీకార రాజకీయాలకు, అరాచకవాదులను కట్టడి చేయడానికి మధ్య తేడాను గుర్తిస్తే న్యాయం జరుగుతుంది. అధికార వ్యవస్థలో అందరిపైనా చర్యలు తీసుకుంటూపోతే ఎవరితో పని చేయించుకోవాలి? ఉన్నవారితోనే పని చేయించుకోవాలి కదా? అన్నది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వైఖరి. నిజమే ఉన్నవారితోనే పని చేయించుకోవాలి. కానీ ఆ ఉన్నవారిలో చాలా మందిలో వ్యవస్థ అంటే భయభక్తులు లేకుండా పోయాయన్నది వాస్తవం. చంద్రబాబునాయుడిలో కూడా అనుభవంతో వచ్చిన పరిణితి కారణంగా దూకుడుగా లేరు. అందువల్ల వ్యవస్థలో భయభక్తులు కాస్త తగ్గాయన్నది నిజం. ప్రభుత్వంలో కీలకమయిన స్థానాలు మూడుంటాయి. ఒకటి ముఖ్యమంత్రి, రెండు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మూడు డీజీపీ. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ స్థాయిలోని వారు కరాఖండిగా, నిక్కచ్చిగా వ్యవహరిస్తే వ్యవస్థలో పై నుంచి కింది వరకు అంతా దారిలోకి వస్తుంది. న్యాయం దానంతట అదే జరుగుతుంది. ఆ రెండు స్థానాల్లో ఉన్న వారి ఎంపికే అత్యంత కీలకం. జీవీ రెడ్డి ఉదంతం తర్వాతయినా క్షేత్రస్థాయిలో వాస్తవాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గ్రహిస్తే వ్యవస్థకు మంచిది. లేదంటే వ్యవస్థే తనను తాను చక్కదిద్దుకునే ప్రయత్నం చేస్తుంది.



తుమ్మల బాల గంగాధర్ తిలక్

# శ్రీసిటీ-ఐమాప్ పరిశ్రమ చేయూత

**• తడ ఐటిఐకి 7.5 లక్షలతో ఆధునిక వసతులు**




శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో శ్రీసిటీ లోని ఇండియా మెటల్ వన్ స్టీల్ ప్లేట్ ప్రాసెసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (ఐమాప్) పరిశ్రమ వారు తడ ప్రభుత్వ ఐటీఐ కళాశాల అభివృద్ధికి తమవంతు చేయూత నందించారు. అధ్వాన్న స్థితిలో ఉన్న 3 తరగతి గదులకు ఇటీవల మరమ్మతులు చేపట్టి ఆధునీకరించారు. తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగంగా 7.5 లక్షల రూపాయలు ఖర్చుపెట్టి, ఆ కళాశాల బాగుకు చర్యలు తీసుకోవడం విశేషం. తరగతి గదుల్లో డెస్కులు, బల్లలు ఏర్పాటుచేశారు. ఈనెల 4న కళాశాల ఆవరణలో నిర్వహించిన ప్రత్యేక కార్య క్రమంలో శ్రీసిటీ డైరెక్టర్ (సిఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి, ఐమాప్ ఉన్నతాధికారుల సమక్షంలో ఐమాప్ మేనేజింగ్ డైరెక్టర్ టయిజో ఇవామి ఆ తరగతి గదులను కళాశాల ప్రిన్సిపాల్ దేవదానంకు అప్ప గించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక విద్యాసంస్థల మౌళిక సదుపాయాలను బలోపేతం చేయడానికి ఐమాప్ మరిన్ని కార్యక్రమాలు చేపడు తుందన్నారు. శ్రీసిటీ డైరెక్టర్ నిరీషా ఐమాప్‌ను అభినందించారు. శ్రీసిటీ ప్రత్యేక చొరవతో శ్రీసిటీ పరిసరాల్లోని ప్రభుత్వ విద్యాసంస్థల మౌళిక సదుపా యాలు చాలా వరకు మెరుగుపడ్డాయంటూ ఆమె సంతోషం వ్యక్తం చేశారు. దానివల్ల విద్యాలయాలకు విద్యార్థులు మరింత ఆసక్తిగా వస్తారని, విద్యా ఫలితాలలో కూడా మంచి పురోగతి వచ్చిందని ఆమె చెప్పారు. గత ఐదేళ్ళలో శ్రీసిటీ ప్రాం తంలో పలు ప్రభుత్వ విద్యాసంస్థల్లో తరగతి గదులు, మరుగుదొడ్లు, ఇతర వసతుల కల్పనకు ఐమాప్ సంస్థ తమ సీఎస్సార్ నిధులలో ఇప్పటిదాకా సుమారు కోటి రూపాయలు ఖర్చు చేసిందని, అంతే కాక శ్రీసిటీ ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐలా)కు అంబులెన్స్ వితరణ, తిరుపతిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళా శాలలో స్టీల్ టెస్టింగ్ కోసం యూనివర్సల్ టెస్టింగ్ మెషిన్, మూడు డిజిటల్ క్లాస్ రూమ్‌ల ఏర్పాటు, జిల్లా అగ్నిమాపక శాఖలో వనరుల పెంపుకు నిధుల సాయం వంటి కార్యక్రమాలు చేపట్టిందని ఈ సందర్భంగా శ్రీసిటీ వర్గాలు వివరించాయి.

# వన్యప్రాణుల సంరక్షణకు..అటవీశాఖ ఏర్పాట్లు

ఈ మండువేసవిని దృష్టిలోపెట్టుకుని, జిల్లాలోని అడవుల్లో వన్యప్రాణులను సంరక్షించేందుకు అటవీ శాఖ ఉన్నతాధికారులు, సిబ్బంది పటిష్టమైన ఏర్పాట్లు చేసేందుకు రంగంలోకి దిగారు. వేసవిలో దప్పికతో గొంతెండిపోతున్న జంతువులు, వన్యప్రాణుల కోసం అడవుల్లో అక్కడక్కడా నీటికుంటలు, నీళ్ళ తొట్లు ఏర్పాటుచేస్తున్నారు. పలు అటవీప్రాంతాల్లోని జంతువులు సమీపంలోని రోడ్లపైకి వచ్చి, ప్రమాదవశాత్తూ వాహనాల కిందపడి చనిపోతుండడం తెలిసిందే. ఈ దుస్థితిని నివారించేందుకు అటవీప్రాంతాల్లో కంచెల ఏర్పాటుకు కూడా అధికారులు ప్రయత్నిస్తున్నారు. పులుల గణన కూడా ఈనెల 5 నుంచి ప్రారంభమైందని, రాపూరు-ఉదయగిరి-ఆత్మకూరు అటవీ రేంజ్ పరిధిలో గుర్తించిన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పెట్టి, పులుల సంచారం కనుగొనేందుకు కృషి చేస్తున్నామని అటవీశాఖ వర్గాలు తెలిపాయి.



# రాజస్థాన్ శిక్షణలో..'డైట్' ఉపన్యాసకులు

నూతన జాతీయ విద్యావిధానానికి సంబంధించి ఇటీవల రాజస్థాన్‌లో జరిగిన శిక్షణలో నెల్లూరుజిల్లా ఇందుకూరుపేట మండలం పల్లిపాడు గ్రామంలోని డైట్ (విద్యాసంస్థ) ఉపన్యాసకులు కూడా పాల్గొనడం విశేషం. ఎన్‌సిఇఆర్‌టీకి చెందిన సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రైనింగ్ (సీసీఆర్టీ) రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో 12రోజుల పాటు పెద్దఎత్తున జరిగింది. ఈ 499వ ఓరియెంటేషన్ కోర్సును నూతన జాతీయ విద్యావిధానం (యన్.ఇ.పి)-2020 ఆధారంగా నిర్వహించారు. ఇందులో దేశానికి చెందిన 14రాష్ట్రాలకు చెందిన 64మంది ప్రభుత్వ డైట్ లెక్చరర్లు పాల్గొనగా, ఆంధ్రప్రదేశ్ నుండి పల్లిపాడు డైట్‌కి చెందిన ఉపన్యాసకులు కాళిదాసు విజయచంద్ర పాలొనడంతో ఆయన్ను డైట్ ప్రధానాచార్యులు డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అభినందించారు. అదేవిధంగా, కృష్ణా జిల్లా డైట్‌కి చెందిన డాక్టర్ పి.టి.జి శ్రీనివాసాచార్యులు, విజయనగరం డైట్‌కి చెందిన ఎల్.రామకృష్ణారావు, పశ్చిమ గోదావరి డైట్‌కి చెందిన పెండెం దుర్గాప్రసాద్‌లు కూడా పాల్గొన్నారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా డైట్ అధ్యాపకులు డి.నరసింగ రావు, యస్.బి.దాస్, కె.షఫీఅహ్మద్, యన్.శివ, కార్యాలయ సూపరింటెండెంట్ యమ్.మేరీ ప్రసూన తదితరులు పాల్గొని విజయచంద్రకు అభినందనలు తెలిపారు.

# వివిఎస్‌యు జాబ్‌మేళా జయప్రదం

**• 33 మందికి ఉద్యోగాలు**

నెల్లూరులోని విక్రమ సింహపురి యూనివర్సిటీ (వివిఎస్‌యు)లో ఈనెల 4న నిర్వహించిన జాబ్‌మేళా విజయవంతమైంది. 69 మంది అభ్యర్థులు హాజరైతే, వారిలో 33 మంది ఉద్యోగ అవకాశాలను సాధించుకోవడం విశేషం. ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, జిల్లా ఎంప్లాయమెంట్ ఆఫీసు మరియు సీడాప్ సంయుక్తంగా నిర్వహించిన ఈ మేళాలో ఏయు స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, క్రెడిట్ ఆక్సిస్ గ్రామీణ లిమిటెడ్, యాక్ట్ ఫైబర్‌నెట్, శ్రీరామ్ ఫోర్చ్యూన్ సొల్యూషన్ కంపెనీ లిమిటెండ్ వంటి ప్రముఖ సంస్థలు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# అళఘునాథుని సేవలో బొమ్మిరెడ్డి

**అర్చకుల నివాసం, వాహనాల భవనం, వంటశాల ప్రారంభం**



గూడూరు పట్టణ అభివృద్ధికి దాతలు అందిస్తున్న సేవలు అభినందనీయమని, భవిష్యత్తులో కూడా పట్టణాభివృద్ధికి కృషి చేయాలని గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని శ్రీ అళఘునాథస్వామి దేవస్థానంలో ఆలయ మాజీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి దాతృత్వంతో నూతనంగా నిర్మించిన అర్చకుల నివాసం, వాహనాల భవనం, వంటశాలను ఈ నెల 2వ తేదీ ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురేంద్రరెడ్డి గతంలో కూడా అనేక సేవా కార్యక్రమాలు చేయడంతో పాటు పలువురు పేదపిల్లలను చదివిస్తున్నారని చెప్పారు. రూ.30లక్షలతో భవనాలు నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. ఈవో శశాంక్, ప్రతినిధులు డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, కె.మునిగిరీష్, బిల్లు చెంచురామయ్య, పులిమి శ్రీనివాసులు, దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



**నంద్యాలలో ఈ నెల 2వ తేదీ జరిగిన విశ్వ హిందూ పరిషత్ దక్షిణాంధ్ర ప్రాంత సమావేశాలలో హెబ్బార్ నాగేశ్వరరావు రచించిన 'సమర స్వరాజ్యం', 'సాయుధ స్వాతంత్ర్యం' అనే రెండు గ్రంథాలను ఆవిష్కరిస్తున్న పరిషత్ ప్రముఖులు.**

# విద్యార్థినులకి డీఎస్పీ అవగాహన



అంతర్జాతీయ మహిళా దినోత్స వాన్ని పురస్కరించుకుని, తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఆదే శాల మేరకు, ఈ నెల 1వ తేదీ డీఎస్పీ గీతాకుమారి గూడూరు పట్టణంలోని తమ కార్యాలయంలో విద్యార్థినిలకు ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైమ్, సోషల్ మీడియా, పోలీసు వ్యవస్థపై అవగా హన కల్పించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ, యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా చక్కగా చదువుకోవాలని, ఏదైనా ఇబ్బందులు ఎదురై నప్పుడు తమ దృష్టికి తీసుకువస్తే సరైన పరిష్కారం చూపుతామని, తొందరపడి ఎటువంటి అఘాయిత్యాలకు పాల్పడవద్దని తెలియ జేశారు. జడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థినులు పాల్గొన్నారు.

# రోటరీ వెస్ట్ క్లబ్ సేవలు అభినందనీయం




గూడూరు పట్టణంలోని డి.ఎన్.ఆర్ కమ్యూనిటీ హాల్లో ఈ నెల 3వ తేదీ రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ సాధు గోపాలకృష్ణ అధికారిక పర్యటనలో భాగంగా ఆయనకు క్లబ్ సభ్యులు ఘనస్వాగతం పలికారు. రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు జరిగాయి. క్రీడల్లో జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచిన రెట్టపల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థులను, పీడీని సన్మానించి, ప్రోత్సాహక నగదును అందజేశారు. సరస్వతీ శిశు మందిరం పాఠశాలకు ఫర్నిచర్ అందజేసి, హాకీ క్రీడాకారులకు పౌష్టికాహారం అందజే శారు. అనంతరం క్లబ్ సభ్యులు గోపాలకృష్ణను ఘనంగా సన్మానిం చారు. క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు నాసిన నాగులు, చోళవరం గిరిబాబు, మునిగిరీష్, వాసుగౌడ్, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, శ్రీకంటి రామ్మోహన రావు, బి.శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# క్రీడాకారులకు లయన్స్ ప్రోత్సాహకాలు

లయన్స్ క్లబ్ గవర్నర్ ఎం.గౌతమ్ అధికార పర్యటన సందర్భంగా ఇటీవల గూడూరు లయన్స్ క్లబ్ వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించింది. గూడూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోని క్రీడాకారులకు క్రీడా దుస్తులు, బ్యాడ్మింటన్, హాకీలలో స్టేట్ లెవల్ టోర్నమెంట్‌కు ఎంపికైన విద్యార్థులకు ప్రోత్సాహకాలు, జ్ఞాపికలు అందజేశారు. నెల్‌క్యాస్ట్ కాలనీలోని దేవాలయానికి బోరు మోటారు, మూడు బెంచీలు అందించడంతో పాటు సరస్వతీ శిశు మందిరంలోని ఇద్దరు మహిళలకు కుట్టు మిషన్లు, 15 మంది పేద మహిళలకు నెలకు సరిపడా సరుకులు, విద్యార్థులకు చిన్న కుర్చీలు అందజేశారు. అలాగే బాలసదన్ లోని బాలికలకు దుస్తులు, పౌష్టికాహారం అందించారు. క్లబ్ అధ్యక్షుడు ఆర్.రవిచంద్ర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాల్లో క్లబ్ డిస్ట్రిక్ట్ ఛైర్మెన్ షేక్ రియాజ్‌అహ్మద్, మల్లెమాల మురళీరెడ్డి, రామ్మోహన్, రూపేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


# వ్యాధిగ్రస్తులకు సిఆర్ రెడ్డి ఆరోగ్య సంజీవని



ఎయిడ్స్ వ్యాధి గ్రస్తుల జీవన ప్రమా ణాలు పెంచేందుకు డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ రోహిణిల సహకారంతో ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రతినెల 'డా. సిఆర్‌రెడ్డి ఆరోగ్య సంజీవని' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 4వ తేదీ గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో డాక్టర్ ప్రసున్న, నెల్లూరు నెట్‌వర్క్ పాజిటివ్ ప్రెసిడెంట్ ధనుర్జ చేతుల మీదుగా 30 మంది ఎయిడ్స్ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కడివేటి చంద్రశేఖర్, కాటూరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

## కళ్యాణ వైభవం...!

### ప్రియ - రజిత్



చెన్నై వాస్తవ్యులు పోరూరి శ్రీనివాసరావు - మైథిలిల కుమార్తె
**క్రిష్ణ ప్రియ - రజిత్‌కుమార్ భట్** ల వివాహం మార్చి 2వ తేదీ నెల్లూరులో వైభవంగా జరిగింది.
నూతన వధూవరులకు 'లాయర్' శుభదీవెనలు.

### సంతోష్ - మౌనిక



నెల్లూరుజిల్లా ఆత్మకూరు వాస్తవ్యులు కుడుముల మధుసూధన్‌రెడ్డి - మైథిలిల కుమారుడు
**సంతోష్‌రెడ్డి - మౌనిక**ల పరిణయం ఫిబ్రవరి 23వ తేదీ నెల్లూరులో ఘనంగా జరిగింది.
కొత్త జంటకు 'లాయర్' శుభాభినందనలు.

# ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే బడ్జెట్



**ఎంపీ విపిఆర్ హర్షం**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రవేశపెట్టిన 2025-26 పూర్తిస్థాయి బడ్జెట్ అన్ని వర్గాల ఆకాంక్షలను ప్రతిబింబిస్తోందని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హర్షం ప్రకటించారు. రాష్ట్ర పునర్నిర్మాణం దిశగా రూ.3.22 లక్షల కోట్లతో అభివృద్ధి, సంక్షేమమే ఎజెండాగా బడ్జెట్ కేటాయింపులు చేయడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి, ఉప ముఖ్య మంత్రి పవన్‌కళ్యాణ్, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌లకి ఆయన తన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలకు భారీ కేటాయింపులు చేయడం సంతోషకరమన్నారు. వ్యవసాయశాఖకు బడ్జెట్‌లో రూ.48,340 కోట్లు కేటాయించడం ద్వారా ఇది రైతు పక్షపాత ప్రభుత్వమని నిరూపించిందన్నారు. వ్యవసాయంపై ప్రధానంగా ఆధారపడిన నెల్లూరు జిల్లాలో లక్షలాదిమంది రైతులకు ఈ బడ్జెట్ ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. అదేవిధంగా, జలవనరుల శాఖకు రూ.18,020 కోట్లు కేటాయింపులు చేయడం, బీసీల సంక్షేమానికి సబ్‌ప్లాన్ ద్వారా బడ్జెట్‌లో 23,260 కోట్లు కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల అభివృద్ధికి కూడా ఈ బడ్జెట్‌లో బాగా నిధులు కేటాయించి వారి అభ్యున్నతికి బాటలు వేశారని, ఆరోగ్యశాఖకు రూ.19,265 కోట్లు, పాఠశాల విద్యకు రూ.31,806 కోట్లు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలకు రూ.18,848 కోట్లు, పురపాలనకు రూ.13,862 కోట్లు కేటాయించి ఆయా శాఖల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారని వివరించారు. అభివృద్ధి ఫలాలు అందరికీ అందేలా కేటాయింపులు చేయడం కూటమి ప్రభుత్వానికే సాధ్యమైందని ఆయన ఈ సందర్భంగా కొనియాడారు.

# 105 పనులకు..9న శంకుస్థాపన

## - రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి



మార్చి 9వ తేదీన నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో 105 ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయబోతున్నామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చెప్పారు. ఈనెల 2న నెల్లూరులోని తన కార్యాలయంలో ఆమేరకు ఆయన నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ శంకుస్థాపనల్లో 51 కార్యక్రమాల్లో తానే స్వయంగా పాల్గొంటానని, మిగిలిన ప్రాంతాల్లో తన సోదరుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కూటమి పార్టీల నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఆ పనులన్నిటినీ 60 రోజుల్లోనే పూర్తి చేయించి ప్రారంభోత్సవాలు కూడా చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమాలను అందరూ విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మాజీ మేయర్ భానుశ్రీ, రాజానాయుడు, అరవ శీను తదితరులు పాల్గొన్నారు.

# నమ్మకానికి మరోపేరు ..'వర్చ్యూసా'

## 'బ్లూమ్ ఫీల్డ్' ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి



రియల్‌ఎస్టేట్ రంగంలో నమ్మకానికి మారుపేరు వర్చ్యూసా కంపెనీ అని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కితాబిచ్చారు. ఇటీవల ఆయన మనుబోలు మండలంలోని కాగితాలపూరు క్రాస్‌రోడ్డులో వేసిన వర్చ్యూసా లేఅవుట్..బ్లూమ్ ఫీల్డ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో సుమారు పాతికేళ్ల అనుభవం ఉన్న పర్చ్యూసా అధినేత వాయుగండ్ల వెంకటేశ్వర్లు నిబద్ధత కలిగిన వ్యక్తి అని ప్రశంసించారు. ఈ కంపెనీ ద్వారా ఇప్పటికే పలు నగరాల్లో 10 వెంచర్లు వేశారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ నటులు..నటీమణులు ఐశ్వర్య, రాజేష్, నిధి అగర్వాల్, జబర్దస్ట్ నటులు రాజు, అప్పారావు, నవీన్, వర్ష తదితరులు పాల్గొని సందడిచేశారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయనీ గాయకులు శ్రీకృష్ణ, సాహితి, గోవింద్‌ల గీతాలాపనలు అందరినీ అలరించాయి. పలువురు డ్యాన్సర్లు నృత్యాలతో ఆకట్టుకున్నారు. పర్చ్యూసా అధినేత మేనమామ సుబ్బయ్య, ఆ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# పార్కుల నిర్వహణకు.. ప్రైవేట్ భాగస్వామ్యం



నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని పలు పార్కుల నిర్వహణకు ప్రైవేట్ భాగస్వామ్యాన్ని కోరుతున్నట్లు అదనపు కమిషనర్ నందన్ తెలిపారు. ఈనెల 4న కమిషనర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రైవేట్ ఏజెన్సీల ఆధ్వర్యంలో పార్కుల నిర్వహణ ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని, నగరంలోని మొత్తం 64 పార్కులకు గాను 36 పార్కులను ప్రైవేట్‌భాగస్వామ్యంతో నిర్వహించేందుకు కృషిచేస్తున్నామన్నారు.

## సేవాభావానికి ప్రతీక...

# సింహపురి వైద్య సేవా సమితి

- ప్రశంసించిన ప్రశాంతిరెడ్డి



నెల్లూరులోని సింహపురి వైద్యసేవా సమితి సేవకు మారుపేరుగా ఉందని, ఆ సేవాసమితి ఆధ్వర్యంలో జయభారత్ ఆసుపత్రి వారు పేదరోగులకు విశేష సేవలందిస్తున్నారని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రశంసించారు. ఇటీవల కొడవలూరు మండలం రాజుపాళెం గ్రామంలో సింహపురి వైద్య సేవా సమితి ఆధ్వర్యంలో జయభారత్ హాస్పిటల్ వారు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సమాజంలో నానాటికీ మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, మరియు ఒత్తిడి వల్ల వచ్చే అనారోగ్య సమస్యల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మెడికల్ క్యాంప్ ద్వారా కిడ్నీ, కళ్ళు, కీళ్ళు, ఎముకల వ్యాధులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్న జయభారత్ వైద్య సిబ్బందిని ఆమె అభినందించారు. మారుమూల ఎస్సీ ఎస్టీ కాలనీలకు జయభారత్ వైద్యసేవలు మరింతగా విస్తరించాలని, అవసరమైతే స్థానిక టీడీపీ స్థానిక నాయకుల సేవలు వినియోగించుకోవాలని ఆమె సేవా సమితి ప్రముఖులకు సూచించారు. కోవూరు నియోజకవర్గంలో విపిఆర్ ఫౌండేషన్ ద్వారా నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో స్థానిక నాయకులే కీలకమన్నారు. అనంతరం, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి తనయులు డాక్టర్ అర్జున్‌రెడ్డి మాట్లాడుతూ, చికిత్స కన్నా వ్యాధి నిర్ధారణ ముఖ్యమన్నారు. అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని, ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం తగదని చెప్పారు. ఈ కార్యక్రమంలో సింహపురి వైద్య సేవా సమితి ట్రస్టీ డాక్టర్ సుబ్రహ్మణ్యం, జివి కృష్ణారెడ్డి, హరికుమార్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## మా ఇల్లు ఇక..

# 'పార్కు పక్కన' ఉంటుందండోయ్!

**చెత్తకుప్పల పక్కన కాదంటూ.. ఎమ్మెల్యే సోమిరెడ్డి సంతోషం**



'మా ఇల్లు ఇకనుంచీ చెత్తకుప్పల పక్కన కాదు.. పార్కు పక్కన ఉంటుందండోయ్'.. అంటూ సాక్షాత్తూ మాజీమంత్రి, సర్వేపల్లి శాసనసభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. మా ఇంటి చిరునామా మారుతున్నందుకు ఆనందంగా ఉందని ఆయన అన్నారు. ఇటీవల నెల్లూరు-నరుకూరు రోడ్డులో అల్లీపురం వద్ద డంపింగ్ యార్డు నుంచి చెత్త తొలగింపు కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. డంపింగ్ యార్డును తొలగించే ప్రక్రియ ప్రారంభం కావడం తమ ప్రాంత ప్రజలందరూ ఎంతో సంతోషించే విషయమన్నారు. అందరి తరపున మంత్రి నారాయణకు ధన్యవాదాలు చెప్తున్నామన్నారు.

'మేం పుట్టక ముందు నుంచి.. మా ఊరు అల్లీపురం వద్ద పెంట దిబ్బలు, చెత్తకుప్పలు ఉన్నాయి. ఎంతోకాలం నుంచి మా ఇంటి చిరునామాకు కేరాఫ్‌గా ఆ దిబ్బలు మారిపోయాయి కూడా. మాకు ఆ చెత్త నుంచి విముక్తి కల్పించాలని ఇటీవల మంత్రి నారాయణను కోరాం. నారాయణ ఒక పని అనుకుంటే దాని అంతు చూస్తారు కదా.. ఆయన చొరవతో ఎట్టకేలకు మా ఇంటి పరిసరాలు కూడా బాగుపడుతున్నాయి. మా ఇల్లు పెంట దిబ్బల పక్కన అని కాకుండా, పార్కు పక్కన అంటారేమో ఇక నుంచి.. అని ఆయన నవ్వుతూ అన్నారు. వైకాపా నేత జగన్మోహన్ రెడ్డి పేర్చిపోయిన చెత్తను తొలగించే కార్యక్రమానికి నారాయణ శ్రీకారం చుట్టడం శుభపరిణామమన్నారు. జగన్‌రెడ్డి హయాంలో బ్రిటిష్ పాలకులకు మించి పన్నులేశారని, చెత్తకు పన్ను వేయడమేంటి?.. 85లక్షల టన్నుల చెత్త పేరుకుపోవడమేంటి?.. అని ఆయన ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.23.88 కోట్లతో 34 వేల మెట్రిక్ టన్నుల చెత్తను ప్రాసెస్ చేయబోతున్నారని, ప్రాసెస్ చేసిన చెత్తలోని పదార్థాలను 20 శాతం సిమెంట్ ఫ్యాక్టరీలకు పంపబోతున్నారని ఆయన చెప్పారు. ప్లాస్టిక్ లేకుండా మిగిలిన మట్టి, వ్యర్థాలను ఎక్కడైనా ఫిల్లింగ్‌కు పంపిస్తారని, మొత్తమ్మీద అక్టోబర్ నాటికి ఈ ప్రక్రియ పూర్తవుతుందని ఆయన తెలిపారు. ఇక్కడ పార్కు ఏర్పాటు కానుండడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# శ్రీసిటీలో జాతీయ భద్రతా వారోత్సవాలు





పారిశ్రామిక కార్మికుల భద్రత ఆవశ్యకతను గుర్తిస్తూ శ్రీసిటీలో 54వ జాతీయ భద్రతా వారోత్సవాలను నిర్వహించారు. ఈనెల 5న ముగింపు వేడుక ఘనంగా జరిగింది. శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ భద్రతా జెండాను ఎగురవేసి భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. ఉద్యోగులు, కార్మికులు, సామాన్య ప్రజలకు భద్రత, ఆరోగ్యం, పర్యావరణంపై అవగాహన కల్పించడమే జాతీయ భద్రతా వారోత్సవాల ముఖ్య ఉద్దేశ్యమని ఆయన చెప్పారు. ఈ ఏడాది జాతీయ భద్రతా మండలి నినాదం 'వికసిత్ భారత్‌కు భద్రత, సంక్షేమం అత్యంత కీలకం' అని, ఆ లక్ష్యానికి అనుగుణంగా పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి భాగస్వాములందరూ సహకరించాలని ఈ సందర్భంగా శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో పేర్కొన్నారు. శ్రీసిటీ సెక్యూరిటీ.. విజిలెన్స్ సీనియర్ మేనేజర్ వై.రమేష్ రోడ్డు భద్రత గురించి ప్రసంగించారు. వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు శ్రీసిటీ అధికారులు సతీష్ కామత్, వై.రమేష్, మహమ్మద్ అలీ బహుమతులు అందచేశారు. వారం రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమాలను శ్రీసిటీ సేఫ్టీ మేనేజర్ కె.నరేంద్రబాబు పర్యవేక్షించారు.




# వీఎస్సార్ స్మారక క్రికెట్ టోర్నమెంట్

**○ విజేతగా నిలిచిన ఎన్‌యుసిసి జట్టు**

నెల్లూరు వీఆర్ కళాశాల పూర్వ ఉపాధ్యాయులు.. జిల్లాలో క్రికెట్ క్రీడకు నారువేసి నీరుపోసిన ఏపీ రంజీ ట్రోఫీ ఆటగాడు.. రంజీ సెలెక్టర్.. 1957లోనే నెల్లూరు యునైటెడ్ క్రికెట్ క్లబ్ (ఎన్‌యుసిసి)ని స్థాపించి క్రికెట్ ఆటగాళ్ళను ప్రోత్సహించిన దివంగత క్రీడాకారుడు వివిస్ రామచంద్రరావు (వీఎస్ఆర్) స్మారకంగా ఇటీవల క్రికెట్ పోటీలు కోలాహలంగా జరిగాయి. సౌత్‌జోన్ క్రికెట్ అసోసియేషన్‌కు కార్యదర్శిగా, ఉపాధ్యక్షునిగా కూడా వీఎస్ఆర్ సేవలందించారు. ప్రత్యేకించి ఎన్‌డీసీఏ, ఏసీఏలకు ఆయన నియమావళిని కూడా రూపొందించి ఇచ్చారు. అంతగా క్రికెట్ క్రీడారంగానికి నిరుపమానమైన సేవలందించినందుకు గుర్తింపుగా.. వీఎస్ఆర్ స్మారకంగా జిల్లా క్రికెట్ అసోసియేషన్ సారధ్యంలో నిర్వహించే ఈ పోటీలకు పలు ప్రత్యేకతలు కూడా ఉన్నాయి. వీఎస్ఆర్ టీ-20 క్రికెట్ టోర్నమెంట్‌గా ప్రసిద్ధి చెందిన ఈ టోర్నమెంట్, గత డిసెంబరు 21 నుంచి ప్రారంభమై ఈ ఏడాది మార్చి 3 వరకు జరిగింది. అందులో భాగంగా వెంకటగిరి, గూడూరు, నెల్లూరుల్లో మొత్తం 118 మ్యాచ్‌లు జరగడం, వీటిలో 46టీమ్‌లు పాల్గొనడం విశేషం. ఫైనల్స్..ఈనెల 3న నెల్లూరు సమీపంలోని బుజబుజనెల్లూరులో ఉన్న సీఏఐ క్రికెట్ అకాడమీ మైదానంలో నిర్వహించారు. హోరాహోరీగా జరిగిన ఈ పోటీల్లో నెల్లూరు యునైటెడ్ క్రికెట్ క్లబ్ విజేతగా, లార్డ్స్ క్రికెట్ క్లబ్ రన్నర్‌గా నిలిచాయి. బహుమతి ప్రదానోత్సవంలో ఏసీఏ మౌలిక సదుపాయాల ఛైర్మెన్ పి.విజయకుమార్, ఏసీఏ సభ్యుడు పి.భానుప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొని క్రీడాకారులను, విజేతలను అభినందించారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ నాయకులు కె.మునిగిరీష్, ఎస్‌కె అబూబకర్,ఎస్.గౌరీశంకర్, ఎన్‌డీసీఏ కేర్‌టేకర్ డి.శ్రీనివాసరెడ్డి, సభ్యులు ఎస్ రాజశేఖర్‌రెడ్డి, కె.శ్రీనివాసులు, బి.లీలామోహన్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

# ధార్మిక ఉత్సవాలతో.. ప్రజల్లో ఐక్యత

**- ఎమ్మెల్యే ప్రశాంతమ్మ**



గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించే ధార్మిక ఉత్సవాలు దైవిక చింతనతో పాటు గ్రామ ఐక్యతకు కూడా దోహదం చేస్తాయని తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యురాలు.. కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి చెప్పారు. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆమె ఇటీవల కొడవలూరు మండలం గండవరం గ్రామంలోని గంగ పార్వతి సమేత శ్రీ ఉదయకళేశ్వరస్వామి వారి తెప్పోత్సవంలో పాల్గొని స్వామివారిని దర్శించు కున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, గండవరం శివాలయం ఎంతో విశిష్టిత కలిగిన చరితాత్మక శైవ క్షేత్రమని, చోళ రాజుల కాలం నాటి ఈ ఆలయంలో భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని చెప్పారు. రాష్ట్ర పౌరసరఫరా కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, టీడీపీ నాయకులు ఆవుల వాసు తదితరులు పాల్గొన్నారు.

# 'దారపు చిత్రాలు' అద్భుతం

**శివశంకరయ్యను మెచ్చుకున్న ఎస్వీయు ప్రముఖులు**



ప్రముఖ సాహితీవేత్త.. పరిశోధకుడు, దారపు శిల్పి డా.శివ శంకరయ్య ఇటీవల తిరుపతిలో ప్రదర్శించిన దారపు చిత్రాలు అందరి ప్రశంసలు అందుకుంటున్నాయి. నెల్లూరుజిల్లా చుంచులూరు ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయునిగా ఉన్న శివశంకరయ్య, తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో తిరుపతి ఆర్ట్ సొసైటీ వారు నిర్వహించిన కళాప్రదర్శనలో ఈ దారపు చిత్రకళ ప్రత్యేతను సంతరించుకుంది. ఈ కార్యక్రమాన్ని అన్నమయ్య భవన్‌లో ఎస్వీ యూనివర్సిటీ ఉప కులపతి అప్పారావు ప్రారంభోత్సవం చేశారు. 25 మంది విశిష్ట చిత్రకారులు చేసిన, వేసిన చిత్రాలను ఆ వేదికపై ప్రదర్శించారు. అందులో శివశంకరయ్య నూలుదారంతో రూపొందించిన బొమ్మలు, దేవతామూర్తుల చిత్రాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఎస్వీయు ఉప కులపతితో పాటు, తెలుగు శాఖ విభాగాధిపతి పీసీ వెంకటేశ్వర్లు దారపు ప్రతిమలను ఆసక్తిగా తిలకించి, వాటి తయారీ విధానాన్ని అడిగి తెలుసుకుని ఆ కళాత్మకతను అభినందించారు. అనంతరం, శివశంకరయ్య వారికి అన్నమయ్య దారపుచిత్రాన్ని కృతజ్ఞతగా అందజేశారు.

## టూకీగా...

### ఇందుకూరుపేటలో శ్రీ మల్లేశ్వరస్వామి రథోత్సవం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఇందుకూరుపేటలోని శ్రీ కామాక్షిదేవి సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో పెద్దఎత్తున వేడుకలు జరిగాయి. ఆలయ అర్చకులు స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. కన్నుల పండువగా నిర్వహించిన రథోత్సవంలో పెద్దఎత్తున ప్రజలు పాల్గొని స్వామివారిని-అమ్మవారిని దర్శించుకున్నారు.

### ఆదూరుపల్లిలో వాహనదారులకు సూచనలు

చేజర్ల మండలం ఆదూరుపల్లి వద్ద ఎస్ఐ తిరుమలరావు ఆధ్వర్యంలో పోలీసులు ఈనెల 2న ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ ధరించడం పట్ల అవగాహన కలిగించారు. ప్రమాదాల్లో ప్రాణాలు కాపాడుకునేందుకు హెల్మెట్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అతివేగం వద్దని, ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని చెప్పారు.

### కుడుమలదిన్నెపాడులో పొగాకు బ్యారెన్ దగ్ధం

కలిగిరి మండలం కుడుమలదిన్నెపాడులోని ఓ పొగాకు బ్యారెన్‌లో ఈనెల 2న ప్రమాదవశాత్తూ జరిగిన అగ్నిప్రమాదంలో బ్యారెన్‌లో పొగాకంతా అగ్నికి ఆహుతి కావడంతో సుమారు 5 లక్షల వరకు నష్టం జరిగినట్లు అంచనా. పొగాకును క్యూరింగ్ చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. వింజమూరు నుంచి అగ్నిమాపకదళం వారు వచ్చి మంటలను ఆర్పారు.

### కొత్తూరులో ఐసీడీఎస్ కార్యక్రమం

ఇందుకూరుపేట మండలం కొత్తూరు జడ్పీ హైస్కూల్‌లో ఈనెల 1న ఐసీడీఎస్ పీడీ రాజ్యలక్ష్మి సూచనలతో విద్యార్థినులకు 'భేటీపఢావో-భేటీ బచావో' కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ లలితాంబ సారథ్యంలో విద్యార్థినులతో సైకిల్ ర్యాలీ నిర్వహించి, అనంతరం చదువు ప్రాముఖ్యతను తెలియజెప్పారు. బాలికలు బాగా చదువుకుని రాణించాలని తెలిపారు.

### వేగూరులో సచివాలయం తనిఖీ

కోవూరు మండలం వేగూరు గ్రామంలో ఉన్న సచివాలయాన్ని ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి ఇటీవల ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం సూచిస్తున్న పలు సర్వేలను వేగవంతం చేయాలని, ఉద్యోగులు-సిబ్బందికి సూచించారు. మండలంలోని సచివాలయ ఉద్యోగులంతా క్రమశిక్షణతో విధులు నిర్వహించాలన్నారు. అలక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

### మన్నంగిదిన్నెలో విస్తరణాధికారులకు శిక్షణ

గ్రామాలను పరిశుభ్రతతో తీర్చిదిద్దుకోవాలని కావలి డీఎల్‌పీఓ మాధవీలత చెప్పారు. ఇటీవల కావలి రూరల్‌లోని మన్నంగిదిన్నెలో పంచాయతీల విస్తరణాధికారుల శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, ఎప్పటికప్పుడు చెత్తను పరిశుభ్రం చేస్తుండాలన్నారు. మండల విస్తరణాధికారి షేక్ అబ్దుల్ సమద్, సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి గీత తదితరులు పాల్గొన్నారు.

### అమ్మవారిపాళెంలో కోడిపందెంరాయుళ్ళ అరెస్ట్

పొదలకూరు మండలం అమ్మవారిపాళెంలో కోడిపందాల స్థావరంపై పొదలకూరు ఎస్ఐ హనీఫ్ ఆధ్వర్యంలో పోలీసులు ఇటీవల దాడిచేసి, నలుగురిని అరెస్ట్‌చేశారు. వారి నుంచి 2 కోళ్ళు, రూ.4,500లు స్వాధీనంచేసుకుని కేసు నమోదుచేశారు.

### పంటపాళెంలో క్యాన్సర్‌పై అవగాహన

ముత్తుకూరు మండలం పంటపాళెంలో ఇటీవల ఎస్ఇఐఎల్ ఎనర్జీ ఇండియా కంపెనీవారు తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ప్రజలకు క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహన కలిగించారు. మండల టీడీపీ అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, హోమీబాబా క్యాన్సర్ ఆసుపత్రి రీసెర్చిసెంటర్ సిబ్బంది, ఎస్ఇఐఎల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

### బుచ్చిలో విద్యార్థులకు 'లయన్స్' బహుమతులు

జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఇటీవల బుచ్చిరెడ్డిపాళెంలోని శ్రీ గోపాలకృష్ణయ్య స్కూల్‌లో విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు నిర్వహించి బహుమతులిచ్చారు. లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ తిరివీధి సుబ్రహ్మణ్యం, కోశాధికారి ఎస్‌వి నాగేశ్వరరావు, మురళీకృష్ణ తదితరులు పాల్గొని విద్యార్థులకు బహుమతులిచ్చారు.

# కళ్యాణ వైభోగం

## గోకుల్ - దివిజల పరిణయం!



పెళ్ళి.. మూడుముళ్ళ బంధం. పెళ్ళి.. ఏడడుగుల సంబంధం. పెళ్ళి.. నూరేళ్ళ అనుబంధం. అలాంటి అపురూప ఆనంద సంబరం రమణీయ కమనీయ చిరస్మరణీయ సంరంభంగా బీద కుటుంబంలో జరిగింది. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ శాసనమండలి సభ్యుడు బీద రవిచంద్ర - శ్రీమతి జ్యోతిల కుమారుడు **గోకుల్ రిష్వంత్ - దివిజ**ల పరిణయం ఫిబ్రవరి 23వ తేదీ నెల్లూరులో జరిగింది.

ఈ పెళ్ళి వేడుకలలో భాగంగా మార్చి 2వ తేదీ హైదరాబాదులో జరిగిన రిసెప్షన్‌లో ఆత్మీయ అతిథులుగా అతిరథ మహారథులు పాల్గొని గోకుల్ రిష్వంత్ - దివిజలని దీవించారు.



Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com